

హోలీ.. రంగుల కేళీ



జిల్లాలో హోలీ సందర్భంగా శుక్రవారం రంగులు చల్లుకున్నారు. తిరుపతి బజారువీధి, ఇతర ప్రాంతాల్లోని మార్వాడీలు రంగులు పూసుకుంటూ ఆనందోత్సాహాలతో గడిపారు. శిల్పారామంలో రంగులు చల్లుకునేందుకు.. పిల్లలు ఆటలాడేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. అక్కడికి చేరుకున్న పలువురు స్థానికులు రంగులు చల్లుకుంటూ ఉత్సాహంగా గడిపారు. శ్రీకాళహస్తి, గూడూరు, నాయుడుపేట, పుత్తూరు, సత్యవేడు, సూళ్లూరుపేట ప్రాంతాల్లోనూ మార్వాడీలు.. వివిధ ప్రాంతాల్లో పనిచేసేందుకు వచ్చిన ఉత్తరాది వారూ హోలీ సంబరాల్లో మునిగి తేలారు.


- తిరుపతి, ఆంధ్రజ్యోతి



ప్రకృతి ఒడిలో కాలినడకన
కుమారధార తీర్థ యాత్ర

- ముక్కోటికి పోటెత్తిన భక్తజనం
- పటిష్టంగా టీటీడీ ఏర్పాట్లు






ఆహ్లాదకరమైన వాతావరణం, పచ్చని చెట్లు నడుమ రాళ్లరప్పలు దాటుతూ, భారీ లోయల్లోకి దిగుతూ, ఎక్కుతూ శేషాచల కొండల్లోని కుమారధార తీర్థానికి శుక్రవారం భక్తజనం పోటెత్తారు. ప్రతి ఏడాది పాల్గుణ పౌర్ణమినాడు టీటీడీ కుమారధార తీర్థముక్కోటిని నిర్వహిస్తోంది. శుక్రవారం ఉదయం 5 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు భక్తులను తీర్థానికి అనుమతించారు. తిరుపతి, తిరుమల స్థానికులతో పాటు వివిధ ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తీర్థాన్ని సందర్శించారు. లోయల్లోకి దిగుతూ, జారే బండల మీదుగా కొండలు ఎక్కుతూ సాగిపోయారు. పదేళ్ల పిల్లలు మొదలు వృద్ధుల దాకా ఈ తీర్థయాత్రలో ఉత్సాహంగా నడిచారు. అనేక చోట్ల టీటీడీ నిచ్చెనలు ఏర్పాటు చేసింది. కొన్ని చోట్ల మోకులు కట్టి పట్టుకుని నడిచే ఏర్పాటు చేశారు. పాపవినాశనం వద్ద టిఫిన్‌లు ఏర్పాటు చేశారు. దారిలోనూ నిరంతరాయంగా అన్నప్రసాదాలు, తాగునీరు, మజ్జిగ వంటివి ఇచ్చారు. భద్రత, వైద్య సిబ్బందిని ఏర్పాటు చేశారు. రద్దీ పెరగడంతో అక్కడక్కడా భక్తులను ఆపేసి, పంపారు. ముఖ్యంగా తీర్థం వద్ద ఎక్కేందుకూ దిగేందుకూ ఒక్కటే నిచ్చెన దారి ఏర్పాటు చేయడంతో గంటన్నర పాటు భక్తులు ఆగిపోవాల్సి వచ్చింది. శుక్రవారం దాదాపు ఆరు వేల మంది కుమారతీర్థానికి నడిచి కుమార స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

- తిరుమల, ఆంధ్రజ్యోతి











‘హరియాణా’ మద్యం వెనుక ఇంకా ఎవరున్నారు?

- పాత్రధారులపై ఆరా తీస్తున్న ఎక్సైజ్ అధికారులు
- ముమ్మరంగా సాగుతున్న దర్యాప్తు

తిరుపతి(నేరవిభాగం) మార్చి 14(ఆంధ్రజ్యోతి): హరియాణా మద్యం వెనుక ఇంకా పాత్రదారులు ఎవరున్నారు? గజేంద్రశర్మ ఒక్కడే ఇంత భారీగా మద్యం తీసుకొచ్చి అమ్మకాలు జరపగలడా? ఇన్నాళ్లుగా మద్యం దందా బయటపడకుండా ఎలా చేయగలిగాడు? ఇతడికి పరోక్షంగా సహకరిస్తున్న వాళ్లు ఎవరైనా ఉన్నారా? ఈ కోణాల్లో ఎక్సైజ్ అధికారులు విచారిస్తున్నారు. గూడూరు, తిరుపతే కాదు.. తమిళనాడులోని తిరుత్తణి, వేలూరు ప్రాంతాల్లోనూ హరియాణా మద్యం విక్రయాలు జరిపినట్లు ఎక్సైజ్ అధికారులు భావిస్తున్నారు. మరోవైపు ఈ అంశాన్ని శుక్రవారం తిరుమలకు వచ్చిన ఎక్సైజ్ మంత్రి కొల్లు రవీంద్ర దృష్టికి అధికారులు తీసుకెళ్లినట్లు తెలిసింది.

‘మనకు తెలియకుండానే జిల్లాకు హరియాణా నుంచి నాన్ డ్యూటీ పెయిడ్ మద్యం ఎలా వస్తోంది’ అని మంత్రి ప్రశ్నించినట్లు సమాచారం. ఈ క్రమంలో సమగ్ర విచారణకు ఎక్సైజ్ డీసీ విజయశేఖర్ ఆదేశించారు. ప్రస్తుతం మద్యం విక్రయాల్లో రాష్ట్ర ప్రభుత్వం అతి తక్కువ మార్జిన్ ఇస్తుండడంతో పెట్టుబడికి వడ్డీ కూడా రావడంలేదని కొందరు నిర్వాహకులు అసంతృప్తితో ఉన్నట్లు తెలుస్తోంది. వీరు హరియాణా మద్యాన్ని అతి తక్కువ ధరకు కొని.. రాష్ట్ర ప్రభుత్వం నిర్దేశించిన ఎంఆర్‌పీకి విక్రయిస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. ఇందులో తిరుపతి నగరంలోని ఓ బార్ యజమాని, నాయుడుపేట, గూడూరులోని ఇద్దరు మద్యం దుకాణా నిర్వాహకుల పాత్రపై ఎక్సైజ్ అధికారులు విచారిస్తున్నారు. అలాగే, కొన్ని దుకాణాలను సబ్‌లీజుకు తీసుకున్న వారిలో కొందరి పాత్ర కూడా ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది. ఇక, వైసీపీ ప్రభుత్వంలో ప్రభుత్వ మద్యం దుకాణాల్లో ధరలు ఎక్కువగా ఉన్నప్పుడు.. రెండేళ్ల కిందటే హరియాణా మద్యం జిల్లాకు తీసుకురావడం మొదలు పెట్టారని సమాచారం. ఇప్పుడు హరియానా మద్యం భారీ ఎత్తున కొనుగోళ్ల వెనుక సబ్ లీజ్‌దారులు ఉండటంతో.. హరియాణాకు చెందిన ప్రధాన సూత్రధారి గజేంద్రశర్మ విచ్చలవిడిగా ఢిల్లీ నుంచి రైళ్లలో హరియాణా మద్యం తీసుకొచ్చి గూడూరు, తిరుపతి కేంద్రంగా సరఫరా చేసినట్లు భావిస్తున్నారు. సబ్‌లీజుదారులు నేరుగా తీసుకెళ్లేవారని అంటున్నారు. దీనివల్ల ఇంత కాలం గుట్టు సాగుతున్నట్లు తెలుస్తోంది. అయితే తాజాగా ఎక్సైజ్ డీసీ విజయశేఖర్ ఆదేశాలతో జిల్లా ఎక్సైజ్ ఈఎస్ నాగమల్లేశ్వరరెడ్డి, అధికారులు సంయుక్తంగా జరిపిన డెకాయ్ ఆపరేషన్‌తో హరియాణా మద్యం విక్రయాల గుట్టు రట్టయింది. ఇంకా, దీని వెనుక పాత్రధారులు ఎవరున్నారనే దానిపై దర్యాప్తు సాగుతోంది.

ట్రాక్టర్ ఢీకొని ఇంటర్ విద్యార్థి దుర్మరణం



కేవీబీపురం, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): కేవీబీపురం మండలం కొత్తూరుకు చెందిన భాస్కర్‌రెడ్డి కుమారుడు దిలీప్(17) శుక్రవారం ఉదయం సెలవు కావడంతో పొలానికి నడచి వెళుతున్నాడు. ఆ సమయంలో కొత్తూరు నుంచి తిమ్మసముద్రంవైపు వెళుతున్న ట్రాక్టర్ వెనుక నుంచి దిలీప్‌ను ఢీకొనడంతో తీవ్రంగా గాయపడ్డాడు. ఎస్ఐ నరేష్ సిబ్బందితో ఘటనా స్థలానికి చేరుకుని దిలీ‌ప్‌ను శ్రీకాళహస్తి ప్రభుత్వ ఏరియా ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ దిలీప్ మృతి చెందాడు. పోలీసులు ట్రాక్టర్‌ను స్వాధీనం చేసుకుని డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ఏరియా ఆస్పత్రికి తరలించి, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

లారీ ఢీకొని ట్రిపుల్ ఐటీ విద్యార్థి మృతి

తడ, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): లారీ ఢీకొని ట్రిపుల్ ఐటీ విద్యార్థి మృతి చెందాడు. కర్ణాటక రాష్ట్రం మాండ్య పట్టణానికి చెందిన ఎంఆర్.ప్రత్యూష్(21) శ్రీసిటీలోని ట్రిపుల్ ఐటీలో రెండో సంవత్సరం చదువుతున్నాడు. శుక్రవారం ఉదయం ప్రత్యూష్‌తో పాటు సహచర విద్యార్థులందరూ కలిసి హోలీ జరుపుకోవాలని నిర్ణయించారు.ప్రత్యూష్ ద్విచక్ర వాహనంలో సూళ్లూరుపేటకు వెళ్లి రంగులు కొనుగోలు చేసి తిరుగు ప్రయాణమయ్యాడు. కొండూరు గ్రామం చెన్నై వెళ్తున్న లారీ ప్రత్యూష్ బైక్‌ను వెనుక నుంచి ఢీకొని అతడిపై నుంచి వెళ్లిపోయింది. ఈ ప్రమాదంతో ప్రత్యూష్ అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసులు ఘటనాస్థలికి చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం సూళ్లూరుపేట ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఎర్రచందనం రక్షణపై నిపుణుల కమిటీ సమావేశం

మంగళం, మార్చి14(ఆంధ్రజ్యోతి): శేషాచలంలోని ఎర్రచందనం సంరక్షణపై ఎన్‌బీఏ, ఏపీఎస్‌బీబీ సంయుక్త ఆధ్వర్యంలో జాతీయ నిపుణుల కమిటీ శుక్రవారం తిరుపతిలో సమావేశమైంది. ఎర్రచందనం వృక్ష సంపదను పెంపొందించడం, ఎర్రచందనాన్ని గ్లోబల్ టెండర్ల ద్వారా విక్రయించి రాష్ట్ర ప్రభుత్వానికి ఆదాయం తెచ్చి పెట్టే అంశాలపై చర్చించారు. అక్రమ రవాణాన్ని అరికట్టడానికి అనుసరించాల్సిన విధానాలు, శేషాచలం అటవీ ప్రాంతంలో జీవ వైవిధ్యాన్ని కాపాడుకోవాల్సిన ఆవశ్యకతపై సమీక్షించారు. జంగిల్ సఫారీ, పర్యాటక అభివృద్ధి వంటి విషయాలపై రాష్ట్ర స్థాయి అటవీ శాఖ అధికారులతో చర్చించినట్లు తెలిసింది. బయో డైవర్సిటీ అథారిటీ ఛైర్మన్ అచలేందర్ రెడ్డి, బయో డైవర్సిటీ బోర్డు రాష్ట్ర ఛైర్మన్ నీలాయపాలెం విజయకుమార్, కార్యదర్శి రామకృష్ణ, తిరుపతి సీసీఎఫ్ సెల్వం, బయోట్రిమ్ స్టేట్ సిల్వికల్చరిస్ట్ నరేంద్రన్, జిల్లా అటవీశాఖాధికారి వివేక్, డివిజనల్ ఫారెస్ట్ అధికారులు, క్షేత్రస్థాయి అటవీశాఖ అధికారులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

అమెరికా కాల్పుల్లో గాయపడ్డ
గోవిందపురం యువకుడు

- ఆదుకుంటామని భరోసా ఇచ్చిన ఎమ్మెల్యే బొజ్జల

శ్రీకాళహస్తి, మార్చి 14(ఆంధ్రజ్యోతి): అమెరికాలో ఓ కారుపై దుండగులు జరిపిన కాల్పుల్లో ఏర్పేడు మండం గోవిందపురం పంచాయతీకి చెందిన పోతగుంట మోహన్ సాయి గాయపడ్డారు. ఇతడు అమెరికాలోని మెమ్ఫిస్ ప్రాంతంలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తున్నారు. భారత కాలమాన ప్రకారం గురువారం రాత్రి 11.30గంటల సమయంలో ఓ స్నేహితుడితో కలిసి కారులో ప్రయాణిస్తుండగా.. ఓ దుండగుడు వీరి కారుపై తుపాకీతో కాల్పులు జరిపాడు. దీంతో మోహన్‌సాయి కుడి భుజం, చేతిపై బుల్లెట్లు దిగడంతో తీవ్రంగా గాయపడ్డారు. ప్రాణాపాయ స్థితిలో మోహన్ తానే కారు నడుపుకుంటూ వాలేరోకు చేరుకుని అత్యవసర సాయం కోసం టోల్‌ఫ్రీ నెంబరుకు ఫోన్ చేశారు. స్థానిక అధికారులు మోహన్‌ను ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం మోహన్‌సాయి తీవ్రగాయాలతో చికిత్స పొందరుతున్నారు. ఈ ఘటనపై సమాచారం అందుకున్న శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి ఫోన్‌లో మోహన్‌సాయి కుటుంబాన్ని పరామర్శించి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఆర్థికసాయం అందించడంతో పాటు ప్రభుత్వపరంగా సహాయకర చర్యలు అందజేస్తామని వారికి ధైర్యంచెప్పారు. అమెరికాలోని ఎన్నారైల ద్వారా మెరుగైన వైద్యసేవలు అందించేందుకు సాయం చేస్తానని కుటుంబ సభ్యులకు తెలిపారు.



చికిత్స పొందుతున్న మోహన్‌సాయి

మహిళా రక్షణకు ‘శక్తి యాప్’

- సెల్‌ఫోన్లలో డౌన్‌లోడ్ చేసుకోవాలన్న ఎస్పీ

తిరుపతి(నేరవిభాగం), మార్చి 14(ఆంధ్రజ్యోతి): మహిళా రక్షణకు శక్తి యాప్ ఉక్కు కవచంగా ఉంటుందని ఎస్పీ హర్షవర్ధనరాజు పేర్కొన్నారు. మహిళలపై పెరిగిపోతున్న హింస, వేధింపులు, అఘాయిత్యాల నివారణకు ప్రభుత్వం ప్రారంభించిన ఈ యాప్‌ను మహిళలందరూ డౌన్‌లోడ్ చేసుకోవాలని శుక్రవారం ఆయన కోరారు. ఆపద సమయంలో ఎస్ఓఎస్ బటన్ నొక్కితే వారున్న ప్రాంతం వివరాలు, దగ్గర్లోని పోలీసు స్టేషన్‌కు, డయల్ 112కు సమాచారం చేరుతుందన్నారు. తద్వారా వెంటనే పోలీసు సిబ్బంది సహాయం పొందవచ్చన్నారు.

డౌన్‌లోడ్ చేసుకోండిలా.. : మొబైల్‌లోని గూగుల్ ప్లే స్టోర్ ద్వారా శక్తి యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలి. అందులో వ్యక్తిగత వివరాలు నమోదు చేయాలి. మొబైల్‌కు వచ్చే ఓటీపీతో ఫోను నెంబరు అనుసంధానం చేయాలి. అత్యవసర పరిచయాలు జోడించాలి. ఏదైనా ప్రమాదం జరిగితే యాప్ ఓపన్ చేసి ఎస్ఓఎస్ బటన్ నొక్కితే మీ లోకేషన్‌ను గుర్తించి పోలీసులు వెంటనే స్పందిస్తారు. ఇక, సమీపంలోని పోలీసు స్టేషన్ల సమాచారం, హెల్ప్‌లైన్ నెంబర్లు యాప్‌లో పొందు పరుస్తారు.

షార్‌కు చేరిన ప్రొపల్లెంట్ మిక్సర్



ప్రత్యేక వాహనంలో షార్‌కు తీసుకెళ్తున్న ప్రొపల్లెంట్ మిక్సర్

సూళ్లూరుపేట, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో) ఇటీవల 10 టన్నుల ఇంధన సామర్థ్యంతో అభివృద్ధి చేసిన ప్రొపల్లెంట్ మిక్సర్ షార్‌కు చేరింది. రాకెట్ల తయారీలో ఘన ఇంధన దశల కోసం దీనిని వినియోగిస్తారు. ఈ ప్రొపల్లెంట్ మిక్సర్‌ను బెంగళూరు నుంచి రోడ్డు మార్గాన భారీ భద్రత నడుమ శుక్రవారం తెల్లవారుజామున షార్‌కు తీసుకొచ్చారు. రాకెట్ జీరో దశలో ఉన్న స్ట్రాపాన్లు మొదటి దశలోని ఘన ఇంధన మోటార్లకు ఇంధనం సరఫరా చేసేందుకు ఈ భారీ ప్రొపల్లెంట్ మిక్సర్ ఉపయోగపడుతుంది. ఇస్రో ప్రస్తుతం ఒకేసారి ఎక్కువ రాకెట్లు తయారీ చేస్తోంది. ఈ క్రమంలో భవిష్యత్ అవసరాల కోసం బెంగళూరులోని సెంట్రల్ మానుఫ్యాక్చరింగ్ టెక్నాలజీ ఇన్‌స్టిట్యూట్ (ఎంటీఐ)తో కలిసి 10 టన్నుల సామర్థ్యం గల ఈ ఘన ఇంధన ఎర్టికల్ ప్లానిటరీ మిక్సర్‌ను ఇస్రో అభివృద్ధి చేసింది. ఈ మిక్సర్ వెడల్పు 3.3 మీటర్లు, ఎత్తు 8.7 మీటర్లు. సుమారు 150 టన్నుల బరువు ఉంటుంది. దీని తయారీ అత్యంత సంక్లిష్టమైన ప్రక్రియ. సున్నితమైన, ప్రమాదకరమైన పదార్థాలను జాగ్రత్తగా మిశ్రమం చేయాల్సి ఉంటుంది. ఈ పరిజ్ఞానం కొన్ని దేశాలకే ఉంది. రాకెట్ల ప్రయోగంలో సాలిడ్ ప్రొపల్షన్ వ్యవస్థ పాత్ర చాలా కీలకం. దేశంలో పది టన్నుల ప్రొపల్లెంట్ మిక్సర్‌ను అభివృద్ధి చేయడం ఇదే తొలిసారి. ఇకపై ఈ మిక్సర్‌ను వినియోగంలోకి తీసుకురానున్నారు.



కన్నులపండువగా
పౌర్ణమి గరుడసేవ

తిరుమలలో శుక్రవారం పౌర్ణమి గరుడసేవ కన్నులపండువగా జరిగింది. ప్రతినెలా పౌర్ణమి సందర్భంగా టీటీడీ గరుడసేవను నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. ఈక్రమంలో శుక్రవారం మలయప్పస్వామికి విశేష అలంకరణ చేసి గరుడుడిపై వేంచేపు చేశారు. రాత్రి 7 గంటలకు మొదలైన వాహన సేవ.. నాలుగు మాడవీధుల్లో సాగింది. భక్తులు స్వామిని దర్శించుకుని కర్పూర హారతులిచ్చి మొక్కులు తీర్చుకున్నారు.

- తిరుమల, ఆంధ్రజ్యోతి

చంద్రగిరి పంచాయతీ ఈవో సస్పెన్షన్

చంద్రగిరి, మార్చి 14(ఆంధ్రజ్యోతి): చంద్రగిరి పంచాయతీ ఈవో మహేశ్వరయ్యను సస్పెండ్ చేస్తూ రాష్ట్ర పంచాయతీరాజ్‌శాఖ కమిషనర్ వీఆర్ కృష్ణతేజ ఉత్తర్వులు జారీ చేసారు. గతవారం చంద్రగిరి ఈవో మహేశ్వరయ్య ఓ కాంట్రాక్టర్ వద్ద రూ.50 వేలు లంచం తీసుకొంటూ ఏసీబీ అధికారులకు పట్టుబడిన విషయం తెలిసిందే. ఆయన్ను అరెస్ట్ చేసి, నెల్లూరులోని ఏసీబీ కోర్టుకు తరలించగా న్యాయమూర్తి రిమాండ్ విధించారు. ఈ క్రమంలో మహేశ్వరయ్యను సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి.

రంజాన్ వేళలు

ఇఫ్తార్ (శనివారం) : 6.26
సహరి (ఆదివారం) : 5.01

నారావారిపల్లెలో ఎల్‌వీఎం డ్రైవింగ్ శిక్షణ



సమావేశంలో మాట్లాడుతున్న సురేష్‌బాబు

చంద్రగిరి, మార్చి 14(ఆంధ్రజ్యోతి): స్వర్ణ నారావారిపల్లె అభివృద్ధిలో భాగంగా గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ (ఆర్‌ఎస్‌ఈటీఐ) ఆధ్వర్యంలో ఏపీ ఎస్‌ఎస్‌డీసీ, డీఆర్‌డీఏ, పంచాయతీరాజ్ శాఖ సహకారంతో 35 మందికి లైట్ వెహికల్ మోటార్ (ఎల్‌వీఎం)పై ఉచిత శిక్షణను శుక్రవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ఆర్‌ఎస్‌ఈటీఐ డైరెక్టర్ సురేష్‌బాబు, స్కిల్ డెవలప్‌మెంట్ జిల్లా అధికారి లోకనాథం ముఖ్య అతిధులుగా విచ్చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ స్వర్ణ నారావారిపల్లె క్లస్టర్ అభివృద్ధిలో భాగంగా యువతకు డ్రైవింగ్‌లో శిక్షణ ఇచ్చి, వారికి బ్యాంకుల ద్వారా రుణాలు మంజూరు చేసి యువతను ఆర్థికంగా అభివృద్ధి చేయడమే ప్రభుత్వ ఉద్దేశమన్నారు. ఈ శిక్షణ 30 రోజుల పాటు ఉంటుందని, శిక్షణ పూర్తి చేసుకున్న అభ్యర్థులకు సర్టిఫికెట్లు ప్రదానం చేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏపీఎం గంగయ్య తదితరులు పాల్గొన్నారు.

మహిళా కార్మికుల జీవితాల్లో మార్పు రావాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఇంటర్నేషనల్ కో-ఆర్డినేటర్ బంధన

భాకరాపేట, మార్చి 14(ఆంధ్రజ్యోతి): మహిళా కార్మికుల జీవితాల్లో మార్పులు తీసుకురావడానికి కృషి చేయాలని 'గ్లోబల్ అలియన్స్ అగైనెస్ట్ ట్రాఫిక్ ఇన్ ఉమెన్' ఇంటర్నేషనల్ కో-ఆర్డినేటర్ బంధన అన్నారు. చిన్నగొట్టిగల్లు మండలం చిగరాలచెరువు హరిజనవాడలో 'విన్స్' సంస్థ ఆధ్వర్యంలో మహిళల హక్కులు-అవకాశాలు అనే అంశంపై అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహి ళలు ప్రశ్నించే తత్వం అలవరచుకుని హక్కులు కాపాడు కోవాలన్నారు. మహిళా కార్మికులు ఆర్థికంగా, సామాజికంగా, రాజకీయంగా ఎదగాల న్నారు. మహిళలు పనిచేసే ప్రదేశంలో భద్రతపై దృష్టి పెట్టాలన్నారు. సేంద్రియ వ్యవసాయ పద్ధతులపై ఎక్కువ మంది మహిళా రైతులు శ్రద్ధ చూపేలా ప్రోత్సహించాలన్నారు. ఈ కార్యక్రమంలో విన్స్ డైరెక్టర్ మీరా, మండల కో-ఆర్డినేటర్ రహంతుల్లా, లెర్నింగ్ ఫెసిలిటేటర్ హరిబాబు, సిబ్బంది నీరజ, హేమలత, చంద్రిక, ప్రణీత, ఎఫ్‌పీవో సభ్యులు దేవకీ దేవి, శ్రీదేవి, ఈశ్వరమ్మ, కమలమ్మ చంద్రమ్మ, కళ్యాణి, లక్ష్మీదేవి, పుష్పలత తదితరులు పాల్గొన్నారు.

పాతకార్ల మెగా ఎక్ఛేంజ్ మేళా ప్రారంభం



మెగా ఎక్ఛేంజ్ మేళాను ప్రారంభిస్తున్న శాప్ ఛైర్మన్ రవినాయుడు

తిరుచానూరు, మార్చి 14(ఆంధ్రజ్యోతి): హర్ష టయోటా తిరుపతి శాఖ ఆధ్వర్యంలో రెవెన్యూ కాలనీలో ఉన్న మ్యాంగో మార్కెట్‌యార్డు ఎదురుగా పాతకార్ల మెగా ఎక్ఛేంజ్ మేళా శుక్రవారం ప్రారంభమైంది. శాప్ ఛైర్మన్ రవినాయుడు, ఆర్‌టీవో మురళీమోహన్, టీడీపీ నేత సురేంద్రనాయుడు, కాంట్రాక్టరు కృష్ణమనాయుడు తదితరులు ఈ మేళాను ప్రారంభించారు. నిర్వాహకులు మాట్లాడుతూ పాత కార్లను సరైన ధరకు ఇచ్చేందుకు కొనుగోలుదారులు, అమ్మకం దారులను ఒకే చోట చేర్చే లక్ష్యంతో ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశామన్నారు. ఈ మేళా 16వ తేదీ వరకు కొనసాగుతుంద న్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకుడు సురేంద్రనాయుడు, కృష్ణమనాయుడు, హర్ష టొయోటా తరపున వైస్‌ప్రెసిడెంట్ వైబీ స్వామి, సీనియర్ జీఎం సాయిబాబా ముఖేష్, ఏజీఎం శివకోటి, సేల్స్ మేనేజరు శ్రీకాంత్, సుభాష్ చౌదరి, జీఎం శరత్ తదితరులు పాల్గొన్నారు.

అమ్మవారికి వేడుకగా తిరుచ్చి ఉత్సవం



తిరుచానూరు, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): తిరుచానూరు లోని పద్మావతి అమ్మవారికి శుక్రవారం రాత్రి అత్యంత వేడుకగా తిరువీధి ఉత్సవం జరిగింది. ఉదయం అమ్మవారిని సుప్రభాత సేవతో మేల్కొలిపి మూలమూర్తికి నేత్రపర్వంగా అర్చకులు అభిషేకం నిర్వహించారు. ఉత్సవర్లకు కల్యాణోత్సవం జరిగింది. మధ్యాహ్నం తిరుమంజనం జరిపించారు. సర్వాలంకార శోభితురాలైన అమ్మవారు తిరుచ్చిపై కొలువుదీరి మాడవీధుల్లో ఊరేగి భక్తులను కటాక్షించారు. ఈ కార్యక్రమంలో సూపరింటెండెంట్ రమేష్, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ ప్రసాద్, సుభాస్కర్‌నాయుడు, చలపతి, సుబ్బరాయుడు తదితరులు పాల్గొన్నారు.

పద్మావతి అమ్మవారి సేవలో పలువురు ప్రముఖులు



ఆలయం వద్ద హైకోర్టు జస్టిస్ లక్ష్మణరావు

తిరుచానూరు, మార్చి 14(ఆంధ్రజ్యోతి): తిరుచానూరులో కొలువై ఉన్న పద్మావతి అమ్మవారిని శుక్రవారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. ఉదయం రాష్ట్ర ఎక్సైజ్‌శాఖ మంత్రి కొల్లు రవీంద్ర అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. హైకోర్టు జడ్జి జస్టిస్ లక్ష్మణరావు కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. అలాగే సినీనటి సంయుక్త కూడా అమ్మవారిని సేవించుకున్నారు. ఆలయ సూపరింటెండెంట్ రమేష్, ఇన్‌స్పెక్టర్ ప్రసాద్, అర్చకులు వారికి స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు.

తిరుమల పవిత్రతలో చంద్రబాబు కృషి కనిపిస్తోంది



● మంత్రి కొల్లు

తిరుమల, మార్చి14(ఆంధ్రజ్యోతి): తిరుమల పవిత్రతను కాపాడేందుకు సీఎం చంద్రబాబు నాయుడు చేసిన కృషి తిరుమల క్షేత్రంలో అడుగడుగున కనిపిస్తోందని మంత్రి కొల్లు రవీంద్ర అన్నారు. తిరుమల శ్రీవారిని శుక్రవారం దర్శించుకున్న ఆయన ఆలయం ముందు మీడియాతో మాట్లాడుతూ.. అమరావతిలో కూడా శ్రీనివాస కల్యాణం కోసం పెద్ద ఎత్తున ఏర్పాట్లు జరుగుతున్నాయన్నారు. రాజధాని అమరావతి పనులు వేగవంతంగా పూర్తికావాలని, ఎలాంటి ఆటంకాలు రాకూడదని స్వామిని ప్రార్థించానన్నారు.

కాలువ మరమ్మతులు ప్రారంభం



చంద్రగిరి, మార్చి 14(ఆంధ్రజ్యోతి): చంద్రగిరిలో ప్రభుత్వ ఆస్పత్రికి వెళ్ళే దారిలో నిత్యం వాహన చోదకులు ప్రమాదాల బారిన పడుతున్నారు. కాలువపై ఇనుప రాడ్లతో జల్లెడ మాదిరిగా దారి ఏర్పాటు చేశారు. దీనిపై భారీ వాహనాలు వెళ్లడంతో ఆ జల్లెడ వంగిపోవడంతో నిత్యం ప్రమాదాలు చోటుచేసుకొంటున్నాయి. దీనిపై శుక్రవారం ఆంధ్రజ్యోతిలో 'నిత్యం ఈదారిలో ప్రమాదాలు' అనే కథనం వెలువడింది. స్పందించిన పంచాయతీ అధికారులు కాలువను బాగుచేసే పనులు ప్రారంభించారు.

ఆర్థికాభివృద్ధిలో మహిళలపాత్ర కీలకం : నాని



ట్రైసైకిళ్లు, ఈఆటోలు అందిస్తున్న ఎమ్మెల్యే పులివర్తినాని, రాస్ ప్రధానకార్యదర్శి వెంకటరత్నం తదితరులు

తిరుపతిరూరల్, మార్చి14(ఆంధ్రజ్యోతి): దేశ ఆర్థికాభివృద్ధిలో మహిళల పాత్ర అత్యంత కీలకమని చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని తెలిపారు. తిరుపతిరూరల్ మండలం చిగురువాడ పంచాయతీ సంస్కృతనగర్‌లోని నిశాల్ కన్వెన్షన్ హాలులో రాష్ట్రీయ సేవాసమితి (రాస్) మహిళా పొదుపు సంఘాల ఆధ్వర్యంలో శుక్రవారం అంతర్జాతీయ మహిళా దినోత్సవం నిర్వహించారు. రాస్ సంస్థ ప్రతినిధులతో కలిసి నియోజక వర్గంలోని మహిళలకు కుట్టుమిషన్లు, ఈఆటోలు, ప్రత్యేక ప్రతిభా వంతులకు ట్రైసైకిళ్లు, వినికిడి యంత్రాలు, వృద్ధులకు చేతి కర్రలు, దుప్పట్లు, టైలరింగ్ శిక్షణ ధ్రువీకరణపత్రాలను ఎమ్మెల్యే అందజేశారు. సామూహిక సీమంతంలో మహిళలను ఆశీర్వదించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాని మాట్లాడుతూ మహిళ విద్యావంతు రాలుగా ఉంటే ఆ ఇల్లు గౌరవంగా ఉంటుందన్నారు. దివంగత సీఎం ఎన్టీరామారావు మహిళలకు ఆస్తిహక్కు కల్పించారని, మహిళా సాధికారత కోసం రెండున్నర దశాబ్దాల కిందటే సీఎం చంద్రబాబునాయుడు స్వయం సహాయక సంఘాలను ఏర్పాటుచేశారని గుర్తుచేశారు. సీఎం చంద్రబాబు నేతృత్వంలో మహిళలకు స్కిల్‌డెవలప్‌మెంట్ ద్వారా ఉద్యోగం, స్వయం ఉపాధి అవకాశాలు కల్పించాలన్న ఉద్దేశంతో జ్యూట్‌బ్యాగ్ శిక్షణా కేంద్రాలను ఏర్పాటు చేశారని వివరించారు. 44సంవత్సరాలుగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు, విదేశీ సంస్థల సహకారంతో మహిళల అభివృద్ధికి రాస్ సంస్థ పలు కార్యక్రమాలను చేపడుతోందని అభినందించారు. రాస్ ప్రధాన కార్యదర్శి వెంకటరత్నం, డీఆర్‌డీఏ పీడీ శోభన్‌బాబు, రాస్ జాయింట్ సెక్రటరీ మమత, డైరెక్టర్ నాగరాజు, విజయ్‌కుమార్, ఈశ్వర్ ప్రసాద్, ఈశ్వరరావు, ఈశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు.

కల్యాణ వెంకన్న ఆలయంలో వైభవంగా గరుడోత్సవం



చంద్రగిరి, మార్చి 13(ఆంధ్రజ్యోతి): శ్రీనివాసమంగాపురంలో వెలసిన కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం రాత్రి గరుడోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. నిత్య సేవల్లో భాగంగా ఉదయం స్వామివారిని సుప్రభాత సేవతో మేల్కొలిపి నిత్యకట్ల కైంకర్యాలు నిర్వహించారు. అనంతరం స్వామి, అమ్మవార్ల ఉత్సవర్లను కల్యాణ మండపానికి వేంచేపు చేసి శ్రీదేవి భూదేవి సమేత కల్యాణ వెంకన్న ఉత్సవర్లకు శాస్త్రోక్తంగా కల్యాణం జరిపించారు. శుక్రవారం పౌర్ణమి సందర్భంగా సాయంత్రం స్వామివారి ఉత్సవమూర్తిని పట్టుపీతాంబరాలు, బంగారు ఆభరణాలతో విశేషంగా అలంకరించి, స్వామివారికి అత్యంత ప్రీతిపాత్ర వాహనం అయిన గరుడ వాహనంపై అధిష్ఠింపజేశారు. అనంతరం స్వామివారు గరుడ వాహనంపై ఆలయ మాడ వీధుల్లో విహరిస్తూ భక్తులను అనుగ్రహించారు. ఈ కార్యక్రమంలో స్పెషల్ డిప్యూటీ ఈవో వరలక్ష్మి, ఏఈవో గోపినాథ్, సూపరింటెండెంట్లు రాజ్‌కుమార్, రమేష్‌కుమార్, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ మునికుమార్, అర్జితం ఇన్‌స్పెక్టర్ అనుంబట్టు ధనశేఖర్, అర్చకులు బాలాజిరంగాచార్యులు, శేషాద్రిచార్యులు, నారాయణాచార్యులు, పార్థసారిధి, జమేదర్ చిరంజీవి, సిబ్బంది పాల్గొన్నారు.

కార్యదర్శి ఎన్వోసీ ఇస్తేనే మీటర్లు ఇచ్చాం

రెవెన్యూ అధికారులు నోటీసులు ఇస్తే తొలగిస్తాం



అక్రమ నిర్మాణాలలో మీటర్లు తనిఖీ చేస్తున్న విద్యుత్ సిబ్బంది

చంద్రగిరి, మార్చి 14(ఆంధ్రజ్యోతి): రెవెన్యూ అధికారులు, పంచాయతీ అధికారులు ప్రభుత్వ భూమిలో అక్రమ నిర్మాణాలకు విద్యుత్ మీటర్లు తొలగించాలని నోటీసులు ఇస్తే విద్యుత్ మీటర్లతో పాటు సోలార్ విద్యుత్ కనెక్షన్‌లు తొలగిస్తామని ఎస్పీడీసీఎల్ డీఈఈ రెడ్డెప్పరెడ్డి, ఏడీఈ శేషారెడ్డి, ఏఈఈ వెంకటరమణ పేర్కొన్నారు. చంద్రగిరి మండలంలోని ఎ.రంగంపేట పంచాయతీ పరిధిలో నాగపట్ల లెక్కదాఖల్లో సర్వే నెంబర్ 80-ఏలో ఉన్న ప్రభుత్వ భూమిలో ఆక్రమణదారులకు ప్రభుత్వం ఉచితంగా అందిస్తున్న సోలార్ విద్యుత్ కనెక్షన్లు ఇవ్వడంపై ఆంధ్రజ్యోతిలో కథనం వెలువడింది. దీంతో శుక్రవారం ఉదయం వారు తమ సిబ్బందితో కలిసి అక్రమ ఇళ్లకు సోలార్ అమర్చడాన్ని పరిశీలించారు. అనంతరం వారు మాట్లాడుతూ ప్రభుత్వ భూమిలో విద్యుత్ మీటర్లు ఇవ్వాలని ఎ.రంగంపేట పంచాయతీ కార్యదర్శి ఎన్వోసీ ఇచ్చారని అందువల్లే 9 అక్రమ నిర్మాణాలకు విద్యుత్ మీటర్లు ఇచ్చామన్నారు. స్వర్ణ నారావారిపల్లె క్లస్టర్ అభివృద్ధిలో భాగంగా విద్యుత్ మీటర్ ఉన్న ప్రతి కనెక్షన్‌కు సోలార్ విద్యుత్ అమర్చాలని ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు అందాయని, అందువలనే సోలార్ విద్యుత్ కనెక్షన్‌లు అమర్చినట్లు తెలిపారు.

మా సిఫార్సు లేఖలు తీసుకోకుంటే..

● తెలంగాణ ప్రజాప్రతినిధులందరం తిరుమలకు వచ్చి చూసుకుంటాం ● బీజేపీ ఎంపీ రఘునందన్‌రావు



ఆలయం ముందు కుటుంబసభ్యులతో రఘునందన్‌రావ

తిరుమల, మార్చి14(ఆంధ్రజ్యోతి): 'తిరుమల శ్రీవారి వీఐపీ బ్రేక్ దర్శనాల కోసం మా సిఫార్సు లేఖలు తీసుకోకుంటే తెలంగాణ ప్రజాప్రతినిధులందరం కలిసి ఒక రోజు తిరుమలకు వస్తాం. టీటీడీ ఏం చేస్తుందో ఆరోజు చూసుకుంటాం. తెలంగాణ ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ, ఎంపీల సిఫార్సు లేఖలను రేపటి నుంచి తీసుకోవాలి' అంటూ బీజేపీ ఎంపీ రఘునందన్‌రావు ఆగ్రహించారు. తిరుమల శ్రీవారిని శుక్రవారం దర్శించుకున్న ఆయన ఆలయం ముందు మీడియాతో మాట్లాడారు. తెలంగాణ ప్రజాప్రతినిధులు పంపిస్తున్న లేఖలను ఫిబ్రవరి 1వ తేదీ నుంచి తీసుకుంటామని టీటీడీ బోర్డు తీర్మానం చేసిందన్నారు. ఉమ్మడి ఏపీలో 294 మంది ఎమ్మెల్యేలు పంపించే సిఫార్సు లేఖలను తీసుకుని వీఐపీ బ్రేక్ దర్శనం, వసతి కల్పించేవారన్నారు. ఏపీ రెండు రాష్ట్రాలుగా విడిపోయిన తర్వాత తెలంగాణ ప్రాంత ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ, ఎంపీలు ఇస్తున్న లేఖలను చంద్రబాబు ప్రభుత్వం వచ్చిన తర్వాత తిరిగి ఫిబ్రవరి నుంచి తీసుకుని దర్శనం కల్పిస్తామని చెప్పారన్నారు. ప్రస్తుతం మార్చి నెల వచ్చినప్పటికీ ఎలాంటి స్పందన లేదన్నారు. 294 మంది ఎమ్మెల్యేల లేఖలను తీసుకున్న టీటీడీ ప్రస్తుతం కేవలం 153 మందికి మాత్రమే పరిమితం కావడం బాధాకరమన్నారు. సీఎం ఆదేశించినా, బోర్డు తీర్మానం చేసినా తమ సిఫార్సు లేఖలను తీసుకోవడం లేదని ఆగ్రహించారు. ఈ వివక్షపై టీటీడీ ఆలోచన చేయాలన్నారు. వెంటనే ఈ అంశంపై టీటీడీ బోర్డు అత్యవసర సమావేశాన్ని నిర్వహించాలన్నారు. తెలంగాణ ప్రజాప్రతినిధుల న్యాయమైన కోరికపై సీఎం చంద్రబాబు నాయుడు కూడా స్పందించాలన్నారు. రానున్న వేసవిలో లేఖలు పంపుతామని, రేపటి నుంచే తమ లేఖలను తీసుకోవాలని డిమాండ్ చేశారు.

ప్రభుత్వం అంగీకరించినా స్పందించడం లేదు: తెలంగాణ విప్



ఆది శ్రీనివాస్

శ్రీవారి దర్శనం కోసం తెలంగాణ ప్రజాప్రతినిధుల సిఫార్సు లేఖలను తీసుకోవాలని సీఎం రేవంత్‌రెడ్డి రాసిన లేఖకు ఏపీ సీఎం చంద్రబాబు స్పందించి అంగీకారం తెలిపినప్పటికీ టీటీడీ అధికార యంత్రాంగం స్పందించడం లేదని, తమ లేఖలను తీసుకోవడం లేదని తెలంగాణ ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు. తిరుమల శ్రీవారిని శుక్రవారం దర్శించుకున్న ఆయన ఆలయం ముందు మీడియాతో మాట్లాడుతూ.. గత తరహాలో తెలంగాణ ప్రజాప్రతినిధుల లేఖలను కూడా తీసుకునేలా టీటీడీ ఛైర్మన్, ఈవో స్పందించాలన్నారు. ఇక, తెలంగాణలో తమ ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా నెరవేరుస్తున్నామన్నారు.

గొల్లవానిగుంట క్రికెట్ మైదానం త్వరలో శాప్ పరిధిలోకి..





గొల్లవానిగుంట క్రీడా మైదానం వద్ద కలెక్టర్ వెంకటేశ్వర్, శాప్ ఛైర్మన్ రవినాయుడు, కమిషనర్ మౌర్య, టీడీపీ జిల్లా అధ్యక్షుడు నరసింహయాదవ్

తిరుపతి(క్రీడలు), మార్చి 14 (ఆంధ్రజ్యోతి): నగరపాలక సంస్థ పరిధిలో ఉన్న గొల్లవానిగుంట క్రికెట్ మైదానాన్ని త్వరలో శాప్‌కు అప్పగించనున్నట్లు కలెక్టర్ వెంకటేశ్వర్ వెల్లడించారు. శుక్రవారం ఉదయం ఆయన శాప్ ఛైర్మన్ రవినాయుడు, నగర కమిషనర్ మౌర్య, టీడీపీ తిరుపతి పార్లమెంటు అధ్యక్షుడు నరసింహయాదవ్‌లతో కలసి క్రీడా మైదానాన్ని పరిశీలించారు. కలెక్టర్ మాట్లాడుతూ మూడేళ్ల క్రితం స్మార్ట్‌సిటీ నిధులతో మొదలైన క్రికెట్ మైదానం పనులు ప్రస్తుతం ఓ కొలిక్కి వచ్చాయన్నారు. త్వరగా పూర్తిచేసి రెండు వారాల్లో శాప్‌కు అప్పగించడానికి చర్యలు తీసుకుంటామన్నారు. 65 సీటింగ్ సామర్థ్యంతో గ్యాలరీ పనులు జరుగుతున్నా యని, ఇంటిగ్రేటెడ్ స్పోర్ట్స్ కాంప్లెక్స్ నిర్మాణం కోసం అదనంగా రూ.2కోట్లు శాప్ నిధులు విడుదల చేస్తామని అన్నారు. ఇక్కడే కబడ్డీ, ఖోఖో, వాలీబాల్ వంటి క్రీడా సదుపాయాలు లభిస్తాయన్నారు. రవినాయుడు మాట్లాడుతూ శాప్ ఆధ్వర్యంలో ఈ మైదానాన్ని మరింత అభివృద్ధి చేస్తామన్నారు. మౌర్యా మాట్లాడుతూ నగర నడిబొడ్డున ఉండడంతో ఈ మైదానం క్రీడా ప్రియులకు, ప్రజలకు సౌకర్యంగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ ఎస్ఈ సురేంద్ర, డీఎస్‌డీవో సయ్యద్‌సాహెబ్ పాల్గొన్నారు.

శిల్పారామంలో హోలీ జోష్





రంగునీళ్లలో మునిగితేలుతున్న చిన్నారి



తిరుచానూరు, మార్చి 14(ఆంధ్రజ్యోతి): తిరుచానూరు రోడ్డులోని శిల్పారామంలో శుక్రవారం ఓ ప్రైవేటు సంస్థ ఏర్పాటు చేసిన హోలీ సంబరాలు కేరింతల మధ్య ఆటపాటలతో ఉత్సాహంగా సాగాయి. నగరంలోని యువత ఈ హోలీ సంబరాల్లో పాల్గొని సహజసిద్ధమైన రంగులను ఒకరిపై ఒకరు చల్లుకున్నారు. డీజే డ్యాన్స్‌లకు యువత చిందులేశారు. శిల్పారామంలోని ఐలాండ్‌లో ఏర్పాటు చేసిన హోలీ వేడుకలు యువతలో జోష్ నింపాయి. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఈ హోలీ సంబరాలు జరిగాయి. అలాగే తిరుచానూరులో కూడా కొంతమంది మార్వాడీలు, అర్చకులు ఒకరిపై రంగులు చల్లుకుని సందడి చేశారు.

లారీ ఢీకొని ఒకరి మృతి

పాకాల, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): చిత్తూరు - కర్నూలు జాతీయ రహదారి పాకాల మండలం గుండ్లగుట్టపల్లె సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందాడు. పేరసానిపల్లె పంచాయతీ తురకపల్లెకు చెందిన ఎస్. నవాబ్ (47) ట్రాక్టర్ డ్రైవర్‌గా, కత్తులకు సానబడుతూ జీవనం సాగించేవాడు. శుక్రవారం సాయంత్రం గ్రామానికి వెళ్లడానికి రోడ్డు దాటుతుండగా కల్లూరు వైపు నుంచి వస్తున్న లారీ ఢీకొంది. దీంతో ఆయన అక్కడికక్కడే మృతిచెందాడు. మృతునికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. పాకాల పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ముగిసిన అల్లాజెండా ఊరేగింపు

రామచంద్రాపురం, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): తొమ్మిదిరోజులుగా గంగిరెడ్డిపల్లె గ్రామంలో నిర్వహించిన అల్లాజెండా ఊరేగింపు శుక్రవారంతో ముగిసింది. ప్రతియేడాది గ్రామంలో 9రోజుల పాటు అల్లాజెండా ఊరేగించడం ఆనవాయితీగా వస్తోంది. ఇందులో భాగంగా ప్రతిరోజూ మసీదు నుంచి మేళ తాళాల నడుమ ఊరేగింపు నిర్వహించారు.

తిరుమలలో ప్రముఖులు



యరపతినేని శ్రీనివాసరావు

తిరుమల, మార్చి14(ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారిని శుక్రవారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. వారిలో.. ఎంపీ శ్రీకృష్ణదేవరాయులు, ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు, ఎమ్మెల్సీ భరత్, తెలంగాణ ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి, టీటీడీ మాజీ జేఈవో సదాభార్గవి, జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్ ఉన్నారు.

సైబర్ ఉచ్చులో సాఫ్ట్‌వేర్ ఉద్యోగి

● రూ.5.39 లక్షలు పోగొట్టుకున్న వైనం

తిరుపతి(నేరవిభాగం), మార్చి 14(ఆంధ్రజ్యోతి): సైబర్ ఉచ్చులో పడి ఒక సాఫ్ట్ వేర్ ఉద్యోగి దాదాపు రూ 5.39 లక్షలు పోగొట్టుకున్న ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. తిరుపతి రూరల్ సీఐ చిన్నగోవిందు కథనం మేరకు.. తిరుపతి రూరల్ పేరూరుకు చెందిన బీ టెక్ విద్యార్థి ప్రస్తుతం బెంగళూరులో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తున్నారు. కొత్త కంపెనీకి మారాలనే ఉద్దేశంతో ఇంటి నుంచి వర్క్ ఫ్రం హోం చేస్తున్నారు. ఈ క్రమంలో 2024 డిసెంబరు 29న ఓ టెలిగ్రామ్ సందేశం వచ్చింది. పార్టు టైమ్ జాబ్ పేరుతో ఆ మెసేజ్‌లో ఉన్న లింక్ ఓపెన్ చేయగా హోటళ్లకు స్టార్ రేటింగ్ ఇస్తే డబ్బు సంపాదించవచ్చని పేర్కొన్నారు. ఆ ప్రకారం పనిచేయగా వెంటనే అతడి బ్యాంకు ఖాతాలో రూ.700 జమ అయింది. అప్పట్నుంచి మీకు స్థిరమైన ఉద్యోగం కావాలంటే ముందుగా డబ్బు జమ చేయాలని చెప్పి సైబర్ నేరగాళ్లు మాయ మాటలు చెప్పారు. దీనిని నమ్మి ఆ ఉద్యోగి మంచి ఉద్యోగం వస్తుందనే ఆశతో తన 12 బ్యాంకు ఖాతాల్లో వున్న రూ 5.39 లక్షలు జమ చేశారు. అయినప్పటికీ మీకు ఇంకా 100 పాయింట్లు పూర్తి కాలేదని, మరింత డబ్బు జమ చేయాలని నేరగాళ్ళు ఒత్తిడి చేశారు. దీంతో మోసపోయినట్లు గ్రహించిన బాధితుడు.. వెంటనే 1930 సైబర్ క్రైం హెల్ప్ లైన్‌కు ఫిర్యాదు చేశారు. శుక్రవారం తిరుపతి రూరల్ సీఐని ఆశ్రయించారు. కేసు నమోదు చేశారు.

అంగన్వాడీ కార్యకర్తకు సీఐటీయూ పరామర్శ

పిచ్చాటూరు, మార్చి 14(ఆంధ్రజ్యోతి): ఇటీవల విజయవాడలో జరిగిన అంగన్‌వాడీ కార్యకర్తల ఆందోళన కార్యక్రమానికి వెళ్లిన పిచ్చాటూరు అం గన్‌వాడీ కార్యకర్త శ్రీవాణి బ్రెయిన్ స్ట్రోక్‌కు గురైన విషయం విదితమే. విజయవాడ ఆస్పత్రి నుంచి ఆమెను తిరుపతి రుయాకు గురువారం తీసుకొచ్చారు. శ్రీవాణికి అందిస్తున్న చికిత్సలపై సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు బాలసుబ్రహ్మణ్యం, అంగన్వాడీ యూనియన్ గౌరవాధ్యక్షుడు ప్రసాదరావు ఆరా తీశారు.

ఆదర్శ పాఠశాలలో ఇంటర్ ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

కేవీబీపురం, మార్చి 14(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాలలో 2025-26 విద్యాసంవత్సరానికి సంబంధించి మొదటి సంవత్సరం ఇంటర్మీడియట్‌కు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ మోహన్ రెడ్డి కోరారు. ఈనెల 18నుంచి మే 22వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు.

శెట్టిపల్లిలో సమస్యల జాతర

ఇళ్ల మధ్యే మురుగునీటి ప్రవాహం - దుస్థితిలో రోడ్లు - మచ్చుకైనా కానరాని పారిశుధ్యం



నివాసాల మధ్య పారుతున్న మురుగు నీరు



శెట్టిపల్లి గ్రామంలో రోడ్లు దుస్థితి

తిరుపతి అర్బన్, మార్చి 14(ఆంధ్రజ్యోతి): నగర శివారు ప్రాంతమైన శెట్టిపల్లిలో మౌలిక సదుపాయాలు లేక ప్రజలు అవస్థలు పడుతున్నారు. శెట్టిపల్లి గ్రామం కొంతభాగం నగరపాలక సంస్థ(మూడు వీధులు), మరికొంత గ్రామ సచివాలయ పరిధి(మూడు వీధులు)లో ఉంటోంది. విభజన తర్వాత ఆ గ్రామంలో నగరపాలక సంస్థ ద్వారా ఎలాంటి అభివృద్ధీ జరగలేదు. వీధులన్నీ గుల్లతేలి అధ్వానంగా ఉన్నాయి. సైడు కాలువలు, అండర్ డ్రైనేజీ వ్యవస్థ లేక మురుగునీరు ఇళ్ల మధ్యనే నిల్వ ఉంటోంది. తద్వారా దోమల బెడద ఎక్కువైంది. తెలుగుగంగ నీటి సరఫరా కూడా అంతంతమాత్రంగానే చేస్తున్నారు. భద్రత లేకపోవడంతో తరచూ గొర్రెలు, మేకలు అపహరణకు గురవుతున్నాయి. సకాలంలో చెత్తనిల్వలు తరలించకపోవడంతో పారిశుధ్యం పూర్తిగా లోపించింది. గత జనవరిలో జరిగిన రెవెన్యూ సదస్సులో సమస్యలు పరిష్కరిస్తామని కలెక్టర్ సాక్షిగా హామీ ఇచ్చిన మున్సిపల్ అధికారులు మూడు నెలలు కావస్తున్నా అటువైపు కన్నెత్తి చూడడం లేదు. ఇక గ్రామ సచివాలయ పరిధిలోని సప్తగిరి లేఅవుట్‌లో మూడు వీధులకుగాను రెండింటికి గతేడాది సీసీ రోడ్లు వేశారు. మరో వీధి గుంతలమయమైంది. డ్రైనేజీలు మచ్చుకైనా కానరాకపోవడంతో మురుగు నిల్వలు మడుగులను తలపిస్తున్నాయి. పిచ్చిమొక్కలు, కంపచెట్లు ఏపుగా పెరిగిపోయాయి. దోమల బెడద ఎక్కువైంది. సమస్యలపై అధికారులు దృష్టి సారించాల్సి ఉంది.



సప్తగిరి లేఅవుట్‌లో గుల్లతేలిన వీధి

నోపార్కింగ్‌లో బైక్‌లు ఆపితే జరిమానా

సీబీఎస్‌లో 17 నుంచి అమలు

తిరుపతి(ఆర్టీసీ), మార్చి 14(ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ సెంట్రల్ బస్టేషన్ నో పార్కింగ్ స్థలాల్లో ప్రైవేటు వాహనాలు ఆపితే రూ.100 జరిమానా విధిస్తామని, ఈ విధానం సోమవారం నుంచి అమలవుతుందని ఏటీఎం రామచంద్రనాయుడు శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈనెల 6న ఆంధ్రజ్యోతిలో 'ఇది బైక్ స్టాండు కాదు..బస్టాండు' అన్న శీర్షికన ప్రత్యేక కథనం ప్రచురితమైంది. ఆర్టీసీ ఉన్నతాధికారులు స్పందించి అనధికార పార్కింగ్ స్థలాల్లో వాహనాలు నిలిపితే చర్యలు తీసుకోవాలని భావించి జరిమానా విధించడానికి సిద్ధమైంది. ఆర్టీసీ ఉద్యోగులైనా ఈ నిబంధనను అనుసరించాల్సిందేనని హెచ్చరించింది.

ఆర్టీసీ హెవీ డ్రైవింగ్ శిక్షణ ప్రారంభం



శిక్షణ పూర్తి చేసుకుని సర్టిఫికెట్ తీసుకుంటున్న అక్షిత

తిరుపతి(ఆర్టీసీ), మార్చి 14 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ అలిపిరి డిపో కార్యాలయంలో శుక్రవారం ఉదయం 32వ బ్యాచ్‌కు హెవీడ్రైవింగ్ శిక్షణ ప్రారంభించారు. అంతకుముందు శిక్షణ పూర్తి చేసుకున్న 31వ బ్యాచ్‌కు సర్టిఫికెట్స్ అందజేశారు. కొత్త బ్యాచ్‌కు సోమవారం నుంచి తరగతులు జరగనున్నాయి. డిపో మేనేజర్ హరిబాబు, అసిస్టెంట్ మేనేజర్లు పుష్పలత, ప్రభాకర్, రాము పాల్గొన్నారు.

తిరుపతిలో 22ఏ భూములకు విముక్తి కల్పించండి

రెవెన్యూ మంత్రి అనగానిని కోరిన డిప్యూటీ మేయర్లు



మంత్రి అనగానిని కలిసిన డిప్యూటీ మేయర్లు ఆర్సీ మునికృష్ణ, ముద్ర నారాయణ తదితరులు

తిరుపతి, మార్చి 14 (ఆంధ్రజ్యోతి) : తిరుపతిలో చాలాచోట్ల నివాసిత ప్రాంతాలను నిషేధిత జాబితా (22ఏ)లో చేర్చారని, వాటికి విముక్తి కల్పించాలని జిల్లా ఇన్‌చార్జి, రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్య ప్రసాద్‌ను మున్సిపల్ కార్పొరేషన్ ముఖ్యులు కోరారు. నూతనంగా ఎన్నికైన డిప్యూటీ మేయర్ ఆర్సీ మునికృష్ణ నేతృత్వంలో విజయవాడలోని మంత్రి కార్యాలయంలో కార్పొరేటర్లు కలిశారు. గతంలో అనేకసార్లు లావాదేవీలు జరిగిన ఆస్తులు కూడా 22ఏలోకి వెళ్లిపోయాయని, నిషేధం ఎత్తివేసి క్రయవిక్రయాలకు అవకాశం కల్పించాలని కోరారు. దీనిపై ఇప్పటికే ప్రభుత్వం కసరత్తు చేస్తోందని, త్వరలోనే విముక్తి కల్పిస్తామని హామీ ఇచ్చినట్లు తెలిసింది. మంత్రిని కలిసిన వారిలో మరో డిప్యూటీ మేయర్ ముద్ర నారాయణ, కార్పొరేటర్లు నరసింహాచారి, నరేంద్రనాథ్, 35వ డివిజన్ నాయకులు ఎస్వీఎం శ్రీధర్, జగ్గ, సుబ్రమణ్యం నాయుడు, బాలాజీ పాల్గొన్నారు.

ఎస్వీయూలో జర్మన్ భాష అభ్యసన కేంద్రం

స్టడీ వింగ్స్ ప్రతినిధులతో అధికారుల సమావేశం



సమావేశంలో ఇరు సంస్థల ప్రతినిధులు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), మార్చి 14 (విశ్వవిద్యాలయాలు): ఎస్వీయూలో జర్మన్ భాష అభ్యసన కేంద్రాన్ని ఏర్పాటు చేసేందుకు కసరత్తు చేస్తున్నారు. ఇందులో భాగంగా స్టడీ వింగ్స్ సంస్థ ప్రతినిధుల బృందం వర్సిటీ అధికారులతో శుక్రవారం సమావేశమైంది. ఇరు సంస్థల ప్రతినిధులు మాట్లాడుతూ జర్మనీలో విద్యా, ఉద్యోగావకాశాలు మెండుగా ఉన్నాయన్నారు. ఇవి పొందాలంటే జర్మన్ భాష నేర్చుకోవాలన్నారు. ఇందుకోసం యూనివర్సిటీలో జర్మన్ భాష అభ్యసన కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని భావిస్తున్నట్లు తెలిపారు. సమావేశంలో వీసీ అప్పారావు, రిజిస్ట్రార్ భూపతి నాయుడు, జర్మన్ స్టడీ వింగ్స్ ప్రతినిధులు నరేంద్రరెడ్డి, సుకన్య పాల్గొన్నారు.

ఆకట్టుకున్న భరత్‌శర్మ ప్రవచనం



ప్రవచనం చేస్తున్న భరత్‌శర్మ

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), మార్చి 14 (విశ్వవిద్యాలయాలు): వేద వాఙ్మయంలో లక్ష్మీదేవి మహాత్మ్యంపై అవధాని ఉప్పలధడియం భరత్‌కుమార్‌శర్మ చేసిన ప్రవచనం ఆకట్టుకుంది. టీటీడీ దివ్య ఆళ్వార్ ప్రబంధ ప్రాజెక్టు ఆధ్వర్యంలో అన్నమాచార్య కళా మందిరంలో లక్ష్మి జయంతి సందర్భంగా చేపట్టిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. శ్రీసూక్తంతో లక్ష్మీదేవి అనుగ్రహం పొందగలమన్నారు. హోలీ సందర్భంగా లక్ష్మీదేవి లీలలను వివరించడం మంచి అనుభూతి కలిగిస్తోందన్నారు. భరత్‌కుమార్‌శర్మను రాయలసీమ రంగస్థలి అధ్యక్షుడు గుండాల గోపీనాథరెడ్డి, చిగోర ఆధ్యాత్మిక కేంద్రం అధ్యక్షుడు హనుమంతరావు సత్కరించారు.

స్టైఫండ్ పెంపు కోసం కృషి చేయండి

ఎమ్మెల్సీ సిపాయికి వెటర్నరీ విద్యార్థుల వినతి



దీక్షా శిబిరంలో వెటర్నరీ విద్యార్థులు

తిరుపతి రూరల్, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): వైద్య విద్యార్థులతో సమానంగా స్టైఫండ్ పెంచాలని ఎస్వీ వెటర్నరీ కళాశాల విద్యార్థులు చేపట్టిన నిరవధిక సమ్మె శుక్రవారమూ కొనసాగింది. ఎమ్మెల్సీ డాక్టర్ సిపాయి సుబ్రమణ్యాన్ని కలసి తమ సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేయాలని విన్నవించారు. యథావిధిగా వర్సిటీ ప్రధాన గేటు ఎదుట ఏర్పాటు చేసిన దీక్షా శిబిరంలో బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. విద్యార్థులు మాట్లాడుతూ దేశమంతా రంగురంగుల హోలీ జరుపుకుంటున్నారని, అయితే తమ జీవితంలో మాత్రం ఎలాంటి రంగులూ లేవని అన్నారు. సమానత్వం, గౌరవం, న్యాయం లభించే వరకు సమ్మె కొనసాగిస్తామని తెలిపారు.

జనసేన ఆవిర్భావ దిన వేడుకలు

మంగళం, మార్చి14 (ఆంధ్రజ్యోతి) : జనసేన ఆవిర్భావ దినోత్సవ వేడుకలు శుక్రవారం స్థానిక రాజన్న పార్కువద్ద ఘనంగా జరిగాయి. కేక్ కట్ చేసుకుని సంబరాలు చేసుకున్నారు. కార్యక్రమంలో జనసైనికులు చెరుకుల నీలాద్రి, జగదీష్, బుజ్జి, జయంతి, గుణ, సతీష్, మధు తదితరులు పాల్గొన్నారు.

అర్హతలేని సంస్థకు సెల్ఫ్ డిఫెన్స్ ప్రోగ్రాం సరికాదు

తిరుపతి(విద్య), మార్చి 14 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో చదివే బాలికలకు స్వీయరక్షణ (సెల్ఫ్ డిఫెన్స్)పై శిక్షణ ఇచ్చే కాంట్రాక్టు అర్హతలేని సంస్థకు కేటాయించడం సరికాదని ఓబీసీ విద్యార్థి సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు డాక్టర్ యు.నాగేశ్వరరావు అన్నారు. ఎమ్మార్‌పల్లెలోని సంఘ కార్యాలయంలో ఆయన శుక్రవారం మీడియాతో మాట్లాడుతూ మ్యాన్‌పవర్ ఏజన్సీని నడిపే సంస్థకు స్వీయరక్షణ శిక్షణ కోసం వర్క్ ఆర్డర్ ఇవ్వడం దారుణమన్నారు. ఇదేసంస్థ నంద్యాల జిల్లాలో దరఖాస్తు చేసుకుంటే అర్హత లేదని ఇవ్వలేదని ఆరోపించారు. దీనిపై జిల్లా అధికారులు పునరాలోచించాలని కోరారు.

వైద్య రంగంలో ల్యాబ్ టెక్నీషియన్ల పాత్ర కీలకం

తిరుపతి(వైద్యం), మార్చి 14 (ఆంధ్రజ్యోతి): వైద్య రంగంలో ల్యాబ్ టెక్నీషియన్ల పాత్ర చాలా కీలకమని మేయర్ డాక్టర్ శిరీషా అన్నారు. స్థానిక కచ్చపి ఆడిటోరియంలో శుక్రవారం నిర్వహించిన మెడికల్ ల్యాబ్ టెక్నీషియన్ దినోత్సవానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆమె మాట్లాడుతూ కొవిడ్ వంటి విపత్కర పరిస్థితుల్లో వ్యాధిని నిర్ధారించేందుకు ల్యాబ్ టెక్నీషియన్లు చేసిన సేవ మర్చిపోలేనిదన్నారు. ఈ కార్యక్రమంలో డీఎంహెచ్‌వో బాలకృష్ణనాయక్, ల్యాబ్ టెక్నీషియన్స్ అసోసియేషన్ నేతలు వినయ్, హరిబాబు, నితిన్ తదితరులు పాల్గొన్నారు.

కన్యకా పరమేశ్వరి ఆలయ ధర్మకర్తల కమిటీ రద్దు

తిరుపతి అర్బన్, మార్చి 14(ఆంధ్రజ్యోతి): కొత్తవీధిలోని కన్యకాపరమేశ్వరి దేవస్థానం ధర్మకర్తల కమిటీని రద్దు చేస్తున్నట్లు దేవాదాయ శాఖ కమిషనర్ గతేడాది ఆగస్టు 16న ఉత్తర్వులు జారీ చేశారని కాశీఅన్నపూర్ణసత్రం ప్రధాన కార్యదర్శి బి.విలాస్‌గుప్తా తెలిపారు. పంగుళూరు సీతమ్మ భూముల అభివృద్ధి పేరిట జరిగిన అవకతవకల కారణంగా కమిటీని రద్దు చేసినట్లు స్పష్టం చేశారు. అయినా ఆ కమిటీ అధ్యక్షుడు పామిడి సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శి కొండూరు మహేష్, ట్రెజరర్ సబరం శిరీష ఇంకా కొనసాగుతుండడం ఆక్షేపణీయమన్నారు. శుక్రవారం కపిలతీర్థం మార్గంలోని శ్రీవారి సన్నిధిలో ఆయన మీడియాతో మాట్లాడుతూ కొత్త కమిటీని ఎన్నుకోవాలని కమిషనర్ ఆదేశించినా పట్టించుకోకపోవడం బాధాకరమన్నారు. ఈ సమావేశంలో పంగళూరు సీతమ్మ ఆర్యవైశ్య ధర్మసత్రం గౌరవాధ్యక్షుడు, ఎండోమెంట్ ఆథరైజ్డ్ పర్సన్ పశుపర్తి గోపీనాథ్, అభివృద్ధి సంఘం ప్రధాన కార్యదర్శి జె.సుబ్బరాజు, ట్రెజరర్ ఈ.లక్ష్మయ్య, మిట్ట లోకేశ్ పాల్గొన్నారు.

స్విమ్స్, రుయా అభివృద్ధికి నిధులు కేటాయించాలి



కాంగ్రెస్ నేతలతో కలిసి ఆందోళన చేస్తున్న చింతా మోహన్

తిరుపతి(వైద్యం), మార్చి 14(ఆంధ్రజ్యోతి): పేదలకు నాణ్యమైన, ఉచిత వైద్య సేవలు అందించాలంటే స్విమ్స్, రుయాస్పత్రులకు కేంద్రం రూ.వెయ్యి కోట్లు కేటాయించాలని కేంద్ర మాజీ మంత్రి చింతా మోహన్ కోరారు. ఈ మేరకు ఆయన స్విమ్స్‌లోని నర్సింగ్ కళాశాల ముందు కాంగ్రెస్ నేతలతో కలిసి శుక్రవారం నిరసన వ్యక్తం చేశారు. నిరుపేదలకు ఉచిత వైద్య సేవలు అందించాలనే లక్ష్యంతో నాడు స్విమ్స్, రుయాస్పత్రులను ప్రారంభించినట్లు చెప్పారు. ఇప్పుడు అక్కడ పేదలకు వైద్యం గాల్లో దీపంలా మారిందన్నారు. స్విమ్స్‌ను ఆదుకోలేమని, దానివల్ల టీటీడీకి ఆర్థిక భారం పెరుగుతుందని ఇటీవల టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు పేర్కొనడం బాధాకరమన్నారు.తిరుపతిలో మూడు క్యాన్సర్ ఆస్పత్రులను ప్రారంభించడాన్ని చూసి కూడా అందరూ నవ్వుకుంటున్నారని తెలిపారు. అలాగే రుయాస్పత్రిలో ఇప్పటికే చిన్నపిల్లల ఆస్పత్రి ఉండగా హృదయాలయం పేరుతో ఒకటి, అలిపిరి సమీపంలో రూ.వందల కోట్లు ఖర్చు పెట్టి మరో సూపర్ స్పెషాలిటీ చిన్నపిల్లల ఆస్పత్రిని నిర్మించడం ఏంటో అర్థం కావడం లేదన్నారు. వెంటనే ఆ భవనాన్ని రుయాస్పత్రికి కేటాయించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నేతలు యార్లపల్లి గోపి గౌడ్, రవి, తేజోవతి, మునిశోభ, వెంకటేష్ గౌడ్ పాల్గొన్నారు.

నేడు స్వచ్ఛాంధ్ర ర్యాలీ

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), మార్చి 14 (ఆంధ్రజ్యోతి): స్వచ్ఛాంధ్ర - స్వర్ణాంధ్ర కార్యక్రమంలో భాగంగా శనివారం ర్యాలీ నిర్వహించనున్నారు. ఉదయం 6 గంటలకు ఎన్టీఆర్ స్టేడియం నుంచి ఎస్వీయూ ఎన్ఎస్ఎస్ - మున్సిపల్ కార్పొరేషన్ సంయుక్తంగా నిర్వహించనున్నాయి. ఇందులో కలెక్టర్ వెంకటేశ్వర్, వీసీ అప్పారావు, రిజిస్ట్రార్ భూపతినాయుడు, కమిషనర్ మౌర్య తదితరులు పాల్గొంటారని ఎస్వీయూ ఎన్ఎస్ఎస్ కో-ఆర్డినేటర్ పాకనాటి హరికృష్ణ తెలిపారు.

పద్మావతీ వర్సిటీకి నేడు ప్రకృతివనం ప్రసాద్


తిరుపతి (విశ్వవిద్యాలయాలు), మార్చి 14 (ఆంధ్రజ్యోతి) : ఆరోగ్యం అంశంపై పద్మావతీ యూనివర్సిటీలో శనివారం సదస్సు నిర్వహించనున్నారు. పబ్లిక్ రిలేషన్ సొసైటీ - ఇంటర్నేషనల్ అలుమిని క్లబ్ సంయుక్తంగా దీన్ని నిర్వహిస్తున్నాయి. ఉదయం 10 గంటలకు సావేరీ హాల్లో ప్రారంభం కానుంది. మదనపల్లెకు చెందిన ప్రకృతి వనం ప్రసాద్ ప్రసంగించనున్నారు.

మూలపడిన వాహనాలను పట్టించుకోండి

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), మార్చి 14 (ఆంధ్రజ్యోతి): ఎస్వీయూలో మూలపడిన వాహనాలను పట్టించుకోవాలని ఎస్ఎఫ్ఐ కోరింది. అనేక వాహనాలు తప్పుపట్టి వినియోగంలో లేకుండా ఉన్నాయని, వీటికి మరమ్మతులు చేయించడమా? విక్రయించి యూనివర్సిటీకి ఆర్థికంగా మేలు చేయడమా? అనేది అధికారులు స్పందించాలని ఎస్ఎఫ్ఐ నేత అశోక్ కోరారు. లేకపోతే ఆందోళన చేపడతామని ఆయన ఒక ప్రకటనలో తెలిపారు.

మనిషిని మంచి మార్గంలో నడిపేదే గొప్ప సాహిత్యం

తమసోమా జ్యోతిర్గమయ పుస్తకావిష్కరణ సభలో వక్తలు



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న సాహిత్యవేత్తలు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), మార్చి 14 (ఆంధ్రజ్యోతి): మనిషిని మంచి మార్గంలో నడిపించేదే చరిత్రలో గొప్ప సాహిత్యంగా నిలుస్తుందని వక్తలు అభిప్రాయపడ్డారు. కవి తోట వేంకటేశ్వర్లు రాసిన 'తమసోమా జ్యోతిర్గమయ' కవితా సంపుటి ఆవిష్కరణ సభను యూత్ హాస్టల్లో శుక్రవారం నిర్వహించారు. రామకృష్ణ మిషన్ కార్యదర్శి సుకృతానంద, సాహిత్యవేత్తలు ఎస్డీడీ చంద్రశేఖర్, గార్లపాటి దామోదరనాయుడు, మేడిపల్లి రవికుమార్ పాల్గొని మాట్లాడారు. సమాజం పట్ల మంచి దృష్టి కలిగిన కవిగా తోట వేంకటేశ్వర్లు సహజమైన రీతిలో మంచి కవిత్వాన్ని రాశారని తెలిపారు. శ్రీశ్రీ వంటి కవుల ప్రభావం కవిగా తోట వేంకటేశ్వర్లులో ఉందన్నారు. కవితలన్నింటినీ కలిపి పుస్తకంగా తీసుకురావడం అభినందనీయమన్నారు. భవిష్యత్తులో ఇదే ఉత్సాహంతో కవిత్వం రాసి, మరిన్ని పుస్తకాలు వెలువరించాలని కోరుకున్నారు. ఈ సందర్భంగా పుస్తక రచయిత తోట వేంకటేశ్వర్లును పలువురు సత్కరించారు. సభలో ఎన్.ధర్మయ్య, బొందు రామచంద్రారెడ్డి, నడ్డి నారాయణ పాడిన పాటలు అలరించాయి. ఈ కార్యక్రమంలో పలువురు సాహిత్యవేత్తలు, సాహిత్యాభిమానులు పాల్గొన్నారు.

వేద వర్సిటీలో జాతీయ ఆయుర్వేద కేంద్ర డైరెక్టర్

వీసీ రాణీసదాశివమూర్తితో సమావేశం



నారాయణం శ్రీకాంత్‌తో మాట్లాడుతున్న వీసీ రాణీసదాశివమూర్తి

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), మార్చి 14 (ఆంధ్రజ్యోతి): సెంట్రల్ కౌన్సిల్ ఫర్ రీసెర్చ్ ఇన్ ఆయుర్వేదిక్ సైన్సెస్ డైరెక్టర్ జనరల్ నారాయణం శ్రీకాంత్ వేద వర్సిటీలో పర్యటించారు. వేద వర్సిటీ వీసీ ప్రొఫెసర్ రాణీసదాశివమూర్తితో సమావేశమయ్యారు. వేద విజ్ఞానంలోని ఆయుర్వేద సంబంధ అంశాలపై చర్చించారు. వేదాల్లోని ఆయుర్వేద అంశాలను సమాజానికి తెలియజేసేందుకు ఇరు సంస్థలు కలిసి పనిచేయాల్సిన అవసరం ఉందనే అభిప్రాయదానికి వచ్చారు. త్వరలో అవగాహన ఒప్పందం చేసుకోవాలని నిర్ణయించారు. ఈ కార్యక్రమంలో వేద వర్సిటీ రిజిస్ట్రార్ భాస్కరుడు, డీన్లు గోలి సుబ్రమణ్యశర్మ, పవన్‌కుమార్, ఆయుర్వేద వైద్యులు మురళీకృష్ణ, ప్రొఫెసర్ రాధేశ్యామ్, ప్రొఫెసర్ రాజేష్‌కుమార్, ఆయుర్వేద కేంద్రం ఏపీ అధ్యక్షుడు గోలి పెంచలప్రసాద్ పాల్గొన్నారు.

ఘనంగా ఐన్‌స్టీన్ జయంతి



ఐన్‌స్టీన్ విగ్రహానికి పూలమాలవేసి, నివాళి అర్పిస్తున్న జనవిజ్ఞాన వేదిక నాయకులు

తిరుపతి(విద్య), మార్చి 14 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ భౌతిక శాస్త్రవేత్త ఐన్‌స్టీన్ 146వ జయంతిని జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఎస్వీ ఆర్ట్స్ కళాశాల ఎదురుగా ఉన్న ఐన్‌స్టీన్ విగ్రహానికి పూలమాలవేసి నివాళి అర్పించారు. ప్రొఫెసర్ సురేంద్రబాబు, కిరణ్ స్కూల్ కరస్పాండెంట్ గడ్డం జయరామిరెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు శాస్త్రీయ దృకథాన్ని పెంచుకుని భవిష్యత్ శాస్త్రవేత్తలుగా ఎదగాలని ఆకాంక్షించారు. ఎస్వీ ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ వేణుగోపాల్‌రెడ్డి, ప్రొఫెసర్ శివకుమార్, సైంటిస్ట్ రామయ్య, జేవీవీ జిల్లాకార్యదర్శి రెడ్డెప్ప, రఫీ, లక్ష్మీనారాయణ, బిర్లా నాయుడు, ఓవీ రమణ, కుప్పస్వామి, దామోదరం, నారాయణ, మునిలక్ష్మి, వెంకటముని పాల్గొన్నారు.

విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను ప్రైవేట్‌పరం చేయకండి

తిరుపతి(ఆటోనగర్), మార్చి 14 (ఆంధ్రజ్యోతి) : ఆంధ్రుల హక్కుగా భావిస్తున్న విశాఖ ఉక్కు కర్మాగారాన్ని ప్రైవేటుపరం చేయరాదని ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఓబులేశు, హరినాథరెడ్డి, బాలసుబ్రమణ్యం, వెంకటరత్నం డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆర్టీసీ బస్టాండ్ ఎదురుగా ఉన్న అంబేడ్కర్ విగ్రహం వద్ద శుక్రవారం కార్మిక, ప్రజా సంఘాలు ధర్నా చేశాయి. విశాఖ స్టీల్ ప్లాంట్‌ను ప్రైవేట్‌పరం చేయరాదని 1,492 రోజులుగా పోరాటాలు చేస్తున్నా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పట్టించుకోకపోవడం దారుణమని మండిపడ్డారు. ఈ కర్మాగారాన్ని సెయిల్‌లో విలీనం చేసి, సొంత గనులు కేటాయించాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం కేంద్రంపై ఒత్తిడి తీసుకురావాలని కోరారు. లేనిపక్షంలో పోరాటాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఎన్‌డీ రవి, వేణుగోపాల్, రాధాకృష్ణ, పి.మురళి, చంద్రశేఖరరెడ్డి, ఎస్.జయచంద్ర, సి.పెంచలయ్య, కేవై రాజా, టి.సుబ్రమణ్యం, అరుణ, బాలాజీ, బుజ్జి, గంగాదేవి తదితరులు పాల్గొన్నారు.

హోలీ సంబరాలు



తిరుపతి(ఉపాధ్యాయనగర్), మార్చి 14(ఆంధ్రజ్యోతి): బీజేపీ ఆధ్వర్యంలో శుక్రవారం హోలీ సంబరాలు కోలాహలంగా జరిగాయి. బండ్లవీధిలో రంగులు చల్లుకుని, స్వీట్లు పంచుకున్నారు.బీజేపీ జిల్లా సాంస్కృతిక విభాగం అధ్యక్షులు గుండాల గోపీనాథ్‌రెడ్డి, చంద్రబాబు యాదవ్, సుబ్రహ్మణ్యం యాదవ్, రవిప్రసాద్ పాల్గొన్నారు.



తిరుమలతో సంయుక్తా మీనన్

హీరోయిన్ సంయుక్తా మీనన్ శుక్రవారం ఉదయం వీఐపీ బ్రేక్‌లో తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. అనంతరం ఆలయం ముందు మీడియాతో మాట్లాడుతూ, ప్రస్తుతం రెండుమూడు సినిమాల్లో నటిస్తున్నట్టు తెలిపారు. సెప్టెంబరులో 'అఖండ 2' విడుదల కానుందన్నారు. 'స్వయంభూ' కూడా విడుదలకు సిద్ధంగా ఉందన్నారు.

- తిరుమల, ఆంధ్రజ్యోతి



సన్నటి పామే కానీ డేంజర్!

చాకచక్యంగా పట్టుకున్న భాస్కర్‌నాయుడు

పాము సన్నటిదే కానీ అత్యంత విషపూరితం. శుక్రవారం నాడు తిరుమల బాలాజీ నగర్‌లో ఒక బైక్‌లోకి ఎక్కేసింది. గమనించిన స్థానికులు భాస్కర్‌నాయుడుకు సమాచారం ఇచ్చారు. ఐదు అడుగులు పొడవున్న తాటికట్ల పామును ఆయన పట్టుకున్నారు.

- తిరుమల, ఆంధ్రజ్యోతి

తిరుమలలో సుప్రీంకోర్టు న్యాయమూర్తి ఎస్వీఎన్ భట్టి



సుప్రీం కోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఎస్వీఎన్ భట్టి శుక్రవారం ఉదయం వీఐపీ బ్రేక్ సమయంలో తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. ఏపీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ లక్ష్మణ్‌రావు కూడా ఆయన వెంట ఉన్నారు. అలాగే తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వేణుగోపాల్, మణిపూర్ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి కృష్ణకుమార్ కూడా వేరువేరుగా శ్రీవారిని దర్శించుకున్నారు.

- తిరుమల, ఆంధ్రజ్యోతి

శ్రీవారి ఆలయం ముందు జస్టిస్ ఎస్వీఎన్ భట్టి, జస్టిస్ లక్ష్మణ్‌రావు

నేడు స్లీపింగ్ డే



రాత్రంగా నిద్ర లేదు..మంచం మీద అటూ ఇటూ దొర్లుతూనే ఉన్నాను.. తెల్లవారుజామున రెండు గంటలు నిద్రపోయానంతే..

..కంటి నిండా నిద్రపోయి చాన్నాళ్లయింది .. ఏమయ్యిందో ఏంటో..

ఈమధ్య మాత్ర వేసుకున్నా నిద్ర పట్టడం లేదు. .

ఇలాంటి మాటలు చాలామంది నుంచి తరచూ వింటుంటాం. ఇటీవల కాలంలో నిద్రలేమితో బాధపడుతున్నవారి సంఖ్య ఎక్కువైంది. వయసుతో సంబంధం లేకుండా 80 శాతం మంది అనారోగ్య సమస్యలకు కారణం సరైన నిద్ర లేకపోవడమేనంటున్నారు వైద్యనిపుణులు. సగటున రోజుకు ఏడు గంటల సేపు నిద్ర పోకున్నా, సక్రమంగా నిద్ర పట్టడం లేదన్నా అనారోగ్య సమస్యలకు దగ్గరవుతున్నారని సంకేతమంటున్నారు.

- తిరుపతి(వైద్యం), ఆంధ్రజ్యోతి



నిద్రపోకుండా ఇలా సెల్‌ఫోన్ చూడటం ప్రమాదకరం

కునుకే బంగారమాయెనె..

- పెరుగుతున్న నిద్రలేమి బాధితులు
- ఒత్తిళ్లు, నిరంతర ఆలోచనలతో సతమతం
- అదేపనిగా మొబైల్ ఫోన్ చూడటమూ కారణమే
- నిద్ర దూరమైతే అనారోగ్యం దగ్గరవుతున్నట్టే

ప్రస్తుత రోజుల్లో చాలామంది నిద్రలేమితో బాధపడుతున్నారు. వివిధ సమస్యలతో ఒత్తిళ్లు ఎదుర్కొంటున్న చాలామంది కంటి నిండా కునుకు తీయలేకపోతున్నారు. మంచం ఎక్కినా నిరంతర ఆలోచనలతో నిద్రకు దూరమవుతున్నారు. ఈతరహా బాధితులు పెరుగుతున్నారని మానసిక వైద్య నిపుణులు చెబుతున్నారు. తమ వద్దకు వస్తున్న రోగుల్లో వీరి సంఖ్య పెరుగుతోందంటున్నారు. దీనికితోడు అన్ని వర్గాల వారూ మొబైల్ ఫోన్లలో మునిగి తేలుతున్నారు. క్షణం ఖాళీ దొరికినా సెల్ చూస్తున్నారు. రాత్రివేళ కూడా దీంతోనే కాలక్షేపంతో చేస్తున్నారు. పగటి పూట కొంత పర్వాలేదు గాని రాత్రిళ్లు దీని ప్రభావ తీవ్రత ఎక్కువగా ఉంటుందని వైద్యులు హెచ్చరిస్తున్నారు. నిద్రపోయే ముందు కళ్లు తీవ్ర ఒత్తిడికి గురైతే సక్రమంగా నిద్ర పట్టదు. చీకట్లో సెల్‌ఫోను చూడటం వల్ల ఆ ప్రభావం మూడింతలవుతోంది. దీంతో కళ్ల కింద నలుపు, వాపు పెరిగి మానసిక సమస్యలు తలెత్తుతాయి. నిద్ర తక్కువైతే జ్ఞాపక శక్తి తగ్గుతుంది. అనారోగ్య సమస్యలు తలెత్తుతాయి.

నిద్ర తక్కువైతే ప్రమాదం



నిద్ర పిల్లలకు, పెద్దలకు ఎంతో అవసరం. ఆరోగ్యంలో దీని ప్రభావం చాలా ఎక్కువ. పదేళ్ల లోపు చిన్నారులు రోజుకు 8-10 గంటలు నిద్రపోవాలి. లేదంటే ఎదుగుదలపై ప్రభావం చూపుతుంది. చిన్నతనంలోనే దీర్ఘకాలిక అనారోగ్య సమస్యలను ఎదుర్కోవాల్సి వస్తుంది. క్రమంగా జ్ఞాపక శక్తి తగ్గిపోతుంది. రాత్రిళ్లు సెల్‌ఫోన్లు ఇవ్వడం వలన నిద్ర తక్కువై ఆ ప్రభావం మొదట్లోనే కళ్లపైనే చూపుతుంది. తరువాత ఊబకాయం, చర్మవ్యాధులు, నరాల సమస్యలు తలెత్తుతాయి. పెద్దలకు కూడా రోజుకు ఏడు గంటల నిద్ర లేకపోతే శారీరక, మానసిక సమస్యలను ఎదుర్కోవాల్సి వస్తుంది. గుండె జబ్బు, రక్తంలో ఆక్సీజన్ స్థాయి తగ్గడం, రోగ నిరోధక వ్యవస్థ దెబ్బతినడం, దీర్ఘకాలిక వ్యాధులకు దగ్గరవుతారని పరిశోధనలు కూడా చెబుతున్నాయి.

- డాక్టర్ మనోహర్, చిన్నపిల్లల విభాగాధిపతి, రుయాస్పత్రి

సుఖ నిద్రకు ఇలా చేస్తే మంచిది



మానసిక సమస్యలతో ఆస్పత్రికి వచ్చే వారిలో చాలా మంది నిద్ర సక్రమంగా పట్టనివారే. శరీరానికి వ్యాయామం ఎంత అవసరమో మానసిక దృఢత్వానికి నిద్ర కూడా అంతే అవసరం. నిద్రకు 2-3 గంటల ముందు భోజనం ముగించాలి. సులువుగా జీర్ణమయ్యే ఆహారం తీసుకోవాలి. పాలు, తక్కువ కొవ్వు ఉండే పదార్థాలు తీసుకోవడం మంచిది. నిద్రకు ముందు కెఫిన్, ఆల్కాహాల్‌ను నివారించాలి. సెల్‌ఫోన్లు, టీవీలను చూడకూడదు. పడుకునే గది చల్లగా, ప్రశాంతంగా, చీకటిగా ఉండేలా చూసుకోవాలి. బెడ్ మీదకు చేరాక కాస్సేపు పుస్తకాలు చదవడం, స్నానం చేయడం, ఇష్టమైన సంగీతం వినడం చేయాలి. ఆరోజు జరిగినవన్నీ పడుకునేముందు మననం చేసుకోకూడదు. పడుకున్న 20 నిముషాలకూ నిద్రరాకపోతే అరు బయటకు వెళ్లి విశ్రాంతినిచ్చే చిన్నపనులు చేస్తే నిద్ర పడుతుంది.

- డాక్టర్ మానస, మానసిక వైద్య నిపుణురాలు, రుయాస్పత్రి

సర్వదర్శనానికి 12 గంటలు

తిరుమలలో వేంకటేశ్వరస్వామి దర్శనానికి 12 గంటల సమయం పడుతోంది. శుక్రవారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2లోని 24 కంపార్టుమెంట్లలో సర్వదర్శన భక్తులు, వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 6 కంపార్టు మెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచిఉన్నారు.

బుధవారం హుండీ ఆదాయం: రూ.3.56 కోట్లు

గురువారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు : 51,148

తలనీలాలు సమర్పించినవారు: 21,236

ప్రాణం తీసిన వేగం

- ఆగివున్న లారీని ఢీకొన్న బైక్.. హోసూరు యువకుడి మృతి

పెళ్లకూరు, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): ద్విచక్ర వాహనంపై వేగంగా వెళ్తూ ఆగివున్న లారీని ఢీకొనడంతో హోసూరు పట్టణానికి చెందిన యువకుడు దుర్మరణం చెందిన ఘటన పెళ్లకూరు మండలంలోని పెన్నేపల్లి వద్ద 71వ జాతీయ రహదారిపై శుక్రవారం ఉదయం జరిగింది. పోలీసుల సమాచారం మేరకు వివరాలు... తమిళనాడు రాష్ట్రం కృష్ణగిరి జిల్లా హోసూరు పట్టణానికి చెందిన అప్పునూ, భారతి దంపతుల కుమారుడు ప్రదీప్ అప్పునూ(27) జర్మనీలో ఇంజనీరింగ్ పూర్తి చేశాడు. హోసూరు పట్టణంలో ప్రదీప్ ఇంజినీరింగ్ కంపెనీ పేరుతో పరిశ్రమ నిర్వహిస్తున్నాడు. జర్మనీలో తనతో పాటు ఇంజనీరింగ్ చదివిన స్నేహితుడి వివాహం శుక్రవారం రాత్రి విజయవాడలో జరుగనుంది. మిత్రుడి వివాహానికి హాజరయ్యేందుకు గురువారం రాత్రి 10.30 గంటలకు బజాజ్ 400సీసీ బైక్‌పై హోసూరు నుంచి విజయవాడకు బయలుదేరాడు. పెళ్లకూరు మండలంలోని పెన్నేపల్లి వద్ద 71వ జాతీయ రహదారిపై ఆగివున్న లారీని వేగంగా ఢీకొని డివైడర్‌కు అమర్చిన ఇనుప చువ్వలకు మధ్యలో ఇరుక్కుపోయిన ప్రదీప్ అప్పునూ అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న ఎస్ఐ నాగరాజు సంఘటనా స్థలానికి చేరుకొని ప్రదీప్ అప్పునూ మృతదేహాన్ని నాయుడుపేట ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పోస్టుమార్టం పూర్తయ్యాక బంధువులకు అప్పగించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని, హెల్మెట్ ధరించి ఉన్నా తలకు తీవ్ర గాయాలై మృతి చెందడంతో బైక్ వేగాన్ని అంచనా వేయలేకపోతున్నట్లు ఎస్ఐ నాగరాజు చెప్పారు.





ప్రదీప్ అప్పూ (ఫైల్‌ఫోటో) - లారీ, ఇనుప ఊచల మధ్య ఇరుక్కు పోయిన బైక్

జనషోన



సభ వద్ద నాగబాబు భార్య



పవన్ అభిమానం



మేం సైతం : సభకు కదలివచ్చిన దివ్యాంగులు

పవనుడు అందరివాడు..



పిఠాపురం, మార్చి 14 (ఆంధ్రజ్యోతి) : పవన్ సభకు ఎక్కడెక్కడి నుంచో అభిమానులు తరలివస్తారు. దానికి తగినట్టు ఏర్పాట్లు కూడా చేశారు. ఇతర రాష్ట్రాల నాయకులు, జనసైనికులు, వీరమహిళలు, అభిమానుల కోసం ఆయా భాషల్లో బోర్డులు ఏర్పాటు చేశారు. జయకేతనం అంటూ తమిళం, కన్నడ, హిందీ తదితర భాషల్లో ఏర్పాటు చేసిన బోర్డులు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. సభ వద్ద కర్నాటక రాష్ట్రానికి చెందిన జన సైనికులు కన్నడ భాషలో రాసి ఉన్న ప్లకార్డులు ప్రదర్శించారు.

జనసైనికా.. కూల్..కూల్..



పిఠాపురం,/కాకినాడ కలెక్టరేట్, మార్చి 14 (ఆంధ్రజ్యోతి) : రండి బాబు రండి పుచ్చకాయలు తిని వెళ్లండి.. లేదంటే మజ్జిగ తాగి వెళ్లండి.. ఏదైనా మీ చాయిస్ అంటూ దారి పొడవునా జనసైనికులను చల్లబరిచారు.. చిత్రాడ జనసేన ఆవిర్భావ సభకు అటు, ఇటూ పది కిలోమీటర్ల దూరం వరకూ ఎక్కడిక్కడ ఏర్పాటు చేసిన ఉచిత కౌంటర్ల ద్వారా ఉదయం నుంచి రాత్రి వరకూ పిలిచి మరీ అందించారు. మజ్జిగ ప్యాకెట్లతో పాటు వాటర్ ప్యాకెట్లు భారీ ఎత్తున పంపిణీ చేశారు.


పచ్చని స్వాగతం..



పర్యావరణ ప్రాధాన్యతను వివరిస్తూ కాకినాడ సర్పవరం జంక్షన్ నుంచి చిత్రాడ వరకూ పచ్చని స్వాగతద్వారాలు ఏర్పాటు చేశారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో అన్ని వర్గాలకు మేలు చేసే పలు కార్యక్రమాలు నిర్వహించిన విశిష్ట వ్యక్తులు పిఠాపురం మహారాజా సూర్యారావు బహద్దూర్, మల్లాడి సత్యలింగ నాయకర్, డొక్కా సీతమ్మ పేర్లను స్వాగత ద్వారాలకు పెట్టడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.

9 చోట్లా ఇంతే

చిత్రాడలో నిర్వహించిన జయకేతనం సభకు సంబంధించి 9 ప్రాంతాల్లో పార్కింగ్ ప్రదేశాలు కేటాయించారు. ప్రతి చోటా వాహనాలన్నీ ఇలా బారులుతీరాయి. బస్‌లు, కార్లు, ద్విచక్రవాహనాలతో ఎక్కడికక్కడ నిండిపోయాయి.



జయకేతనం.. విజయకేతనమే.. యువత ఉప్పొంగింది.. చిత్రాడను ముంచెత్తింది.. ఎటు చూసినా ఎక్కడ చూసినా జనమే జనం.. కాకినాడ జిల్లా పిఠాపురం మండలం చిత్రాడ వీధులన్నీ జనంతో నిండిపోయాయి.. జై పవన్.. జై జై పవన్ నినాదాలతో మార్మోగిపోయాయి.. డిప్యూటీ సీఎం.. పిఠాపురం ఎమ్మెల్యేగారి తాలూకా బైక్‌లతో నిండిపోయాయి.. కార్లు.. ఆటోలు.. బస్‌లు క్యూకట్టాయి.. రకరకాల విన్యాసాలు చేసుకుంటూ జనసైన్యం కదిలింది.. పవన్‌పై అభిమానం చాటింది. శుక్రవారం తెల్లవారుజాము నుంచే జనసైనికులు తరలిరావడం ఆరంభించారు.. ఆలస్యంగా వెళితే అన్నను వెనుక నుంచి చూడాలని ముందుగానే జయకేతనం సభ నిర్వహించే చిత్రాడకు చేరుకున్నారు.. లక్షలాది మందితో గ్రామం కిక్కిరిసిపోయింది..

మొక్కు తీరుద్దామని..



పిఠాపురం : 2024 అసెంబ్లీ ఎన్నికల్లో పవన్‌కల్యాణ్ విజయం సాధిస్తే వైజాగ్‌లోని కనకమహాలక్ష్మి.. తిరుమల వెంకటేశ్వరస్వామి.. హైదరాబాద్‌లోని పెద్దమ్మతల్లి గుడికి వస్తానని అనకాపల్లి జిల్లా పాయకరావుపేటకు చెందిన జనసైనికుడు గుత్తుర్తి విజయబాబు మొక్కుకున్నాడు. సైకిల్‌పై మొక్కు తీర్చుకునేందుకు తిరుపతికి బయలుదేరి చిత్రాడలో జరుగుతున్న జనసేన సభ వద్దకు వచ్చారు. సభ చూసిన తర్వాత తిరుమలకు సైకిల్‌పై వెళతానని విజయబాబు తెలిపారు.





చిత్రాడదారులన్నీ జనపవనమై..

పుత్తూరు వార్తలు

నేడు మున్సిపల్ కౌన్సిల్ సమావేశం

పుత్తూరు అర్బన్, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): పుత్తూరు మున్సిపల్ కౌన్సిల్ సమావేశం ఏర్పాటుకు చైర్మన్ ఆమోదం తెలిపారు. మూడు పర్యాయాలు వాయిదా అనంతరం ఎట్టకేలకు ఈనెల 15న శనివారం నిర్వహించనున్నట్టు ప్రకటించారు. ఇక ఈ సమావేశంలో ప్రతిపక్ష టీడీపీ కౌన్సిలర్లు పలు అంశాలను లేవనెత్తనున్నట్లు సమాచారం. అధికార పక్ష కౌన్సిలర్లు కూడా అజెండా రూపకల్పనలో మున్సిపల్ చైర్మన్ హరి తీరును ఎండగట్టనున్నట్లు తెలుస్తోంది. అసెంబ్లీలో ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ పుత్తూరు మున్సిపాలిటీలో అవినీతిపై సభ దృష్టికి తీసుకొచ్చిన నేపథ్యంలో అధికార కౌన్సిల్ అవినీతిపై చర్చకు టీడీపీ పట్టుబట్టే అవకాశం ఉంది. ట్రాఫిక్ నియంత్రణ అంశంపై చర్చించనున్నారు. మున్సిపల్ దినసరి మార్కెట్, జంతువధ శాల, ప్రైవేటు బస్టాండ్ 2025-26 ఏడాదికి బహిరంగ వేలం ఆమోదించే ముందు బకాయి అంశాన్ని లేవనెత్తనున్నట్టు సమాచారం. అక్రమ కట్టడాలను యథేచ్ఛగా ప్రోత్సహిస్తున్న పట్టణ ప్రణాళిక విభాగం తీరుపై కౌన్సిల్ సమావేశంలో ఎండగట్టనున్నట్టు తెలిసింది. కౌన్సిల్‌లో 20 మంది వైసీపీ కౌన్సిలర్లు, ముగ్గురు కో-ఆప్షన్ సభ్యులు ఉండగా, టీడీపీ తరపున ఐదుగురు కౌన్సిలర్లు ఎన్నిక కాగా, ఇటీవల 11, 17 వార్డులకు చెందిన ఇద్దరు కౌన్సిలర్లు తెలుగుదేశం కండువాలు కప్పుకున్నారు. ఈ సంఖ్యా బలంతో తమ గళాన్ని విప్పనున్నారు.

సకాలంలో పన్నులు చెల్లించండి

పుత్తూరు అర్బన్, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): పుత్తూరు పట్టణ ప్రజలు సకాలంలో పన్నులు చెల్లించి మున్సిపాలిటీ అభివృద్ధికి తోడ్పాటు అందించాలని కమిషనర్ మంజునాథ్ గౌడ్ ఒక ప్రకటనలో కోరారు. వడ్డీ మాఫీ వంటివి ఈ ఏడాది ఉండబోదని స్పష్టం చేశారు. ఇంటి పన్ను, కొళాయి పన్ను, ఖాళీ స్థలం పన్నులు వెంటనే చెల్లించాలని కోరారు. ప్రజల సౌకర్యార్థం ఆదివారం కూడా మున్సిపల్ కార్యాలయంలో పన్నులు చెల్లించే సౌలభ్యం కల్పిస్తున్నామన్నారు. అంతే కాకుండా ఆయా వార్డు సచివాలయాల్లో, సీడీఎంఏ వెబ్‌సైట్‌లో కూడా పన్నులు చెల్లించవచ్చని తెలిపారు.

ఇఫ్తార్ విందుకు ఎమ్మెల్యేకు ఆహ్వానం



భానుప్రకాష్‌ను ఆహ్వానిస్తున్న ముస్లిం మైనార్టీ నాయకులు

వడమాలపేట, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): రంజాన్ పండుగ సందర్భంగా ఇఫ్తార్ విందుకు వడమాలపేట ముస్లిం నాయకులు ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్‌ను ఆహ్వానించారు. ఈనెల 23న వడమాలపేట మసీదులో జరిగే ఇఫ్తార్ విందుకు రావాల్సిందిగా శుక్రవారం తిరుపతిలోని ఎమ్మెల్యే నివాసంలో ముస్లిం మైనార్టీ యూత్ అసోసియేషన్ నాయకులు కలిసి విన్నవించారు. చాన్ బాషా, మస్తాన్, హుసేన్ భాష, రెహ్మాన్, యాకూబ్, బాబు లాల్, హమీద్ బాషా తదితరులు ఉన్నారు.

కోలాహలంగా హోలీ



పుత్తూరు టౌన్, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో హోలీ పండుగను కోలాహలంగా జరుపుకున్నారు. టీటీడీ కల్యాణ మండపంలో మార్వాడీలు రంగులు చల్లుకుంటూ హోలీ శుభాకాంక్షలు చెప్పుకున్నారు. అనంతరం చిన్నాపెద్దా తేడాలేకుండా నృత్యాలు చేస్తూ రంగు నీళ్లు చల్లుకున్నారు. ఈ కార్యక్రమంలో మార్వాడీలు గోవింద్, నవరతన్, రాకేష్, సంతోష్, దేవర రామ్, మోహన్ లాల్, ఇంద్రజిత్ జైన్, బాబులాల్ తదతరులు పాల్గొన్నారు.

మౌలిక వసతులు కల్పించండి

పుత్తూరు టౌన్, మార్చి 14(ఆంధ్రజ్యోతి): మున్సిపాలిటీ పరిధిలోని తాయిమాంబపురంలో మౌలిక వసతులు కల్పించాలని సీపీఎం పట్టణ కార్యదర్శి వెంకటేష్ పేర్కొన్నారు. శుక్రవారం సమస్యలను తెలుసుకునేందుకు ప్రజా చైతన్య యాత్ర నిర్వహించారు. తాగునీరు సక్రమంగా సరఫరా చేయాలని, ఇళ్ల పట్టాలు పంపిణీ చేయాలని కోరారు. సుబ్రహ్మణ్యం, సాంబయ్య, కృష్ణయ్య, మారెప్ప, రాజయ్య, వరలక్ష్మి, చెంగమ్మ, లక్ష్మి పాల్గొన్నారు.

ఘనంగా జనసేన ఆవిర్భావ దినోత్సవం



వరదయ్యపాళెం బస్టాండు వద్ద కేక్ కటింగ్

వరదయ్యపాళెం, మార్చి 14(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని బస్టాండు వద్ద జనసేన ఆవిర్భావ దినోత్సవాన్ని ఆ పార్టీ నాయకులు ఘనంగా నిర్వహించారు. పార్టీ జెండా ఆవిష్కరించి అనంతరం కేక్ కట్ చేశారు. పేదలకు అన్నదానం చేశారు. జనసేన జిల్లా కార్యదర్శి తడ శ్రీనివాసులు మాట్లాడుతూ.. అధ్యక్షుడు పవన్ కల్యాణ్ పార్టీ ఆవిర్భావం నుంచి రాష్ట్ర ప్రజల భవిష్యత్తు కోసం ఎన్నో పోరాటాలు చేశారన్నారు. వెంకటేశ్వర్లు, విజయకుమార్, శ్రీధర్, చంద్రశేఖర్, శేఖర్‌రెడ్డి, చిరంజీవి, శేఖర్, సాగర్, శిరీష్, షాబాన, గురునాథ్, సాయి తదితరులు పాల్గొన్నారు.



సత్యవేడు (ఆంధ్రజ్యోతి): సత్యవేడులో జనసేన 12వ ఆవిర్భావ దినోత్సవాన్ని శుక్రవారం ఆ పార్టీ నాయకుడు కె. బాలమురళీకృష్ణ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. క్లాక్ టవర్ వద్ద పార్టీ జెండాను ఆవిష్కరించి, కేక్ కట్ చేసి అందరికీ పంచి పెట్టారు. సత్యా రాయల్, టీఎస్ కుమార్, రాజేష్, దినకరన్, ఆదికేశవ, తదితరులు పాల్గొన్నారు.

ప్రైవేటు గోడౌన్‌లో చోరీకి యత్నం



ఆగంతకులు వదిలి వెళ్లిన ఏసీ అవుట్ డోర్ యూనిట్

పుత్తూరు అర్బన్, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): మున్సిపల్ పరిధిలోని నెత్తం గ్రామంలో ఓ ప్రైవేటు గోడౌన్‌లో చోరీకి విఫలయత్నం చేశారు. సాయంత్రం 5 గంటలకు గోడౌన్ నిర్వహకుడు పార్థసారథి వర్మ వచ్చి చూడగా ఈ విషయం వెలుగు చూసింది. ఆయన వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వగా స్పందించలేదు. చివరికి డీఎస్పీ రవికుమార్ దృష్టికి తీసుకెళ్లారు. డీఎస్పీ ఆదేశాల మేరకు రాత్రి 8 గంటలకు ఎస్‌ఐ ఓబయ్య సంఘటనా స్థలానికి చేరుకుని ఆధారాలను సేకరించారు. సీసీ కెమెరా ఆపరేటింగ్ సిస్టం, హార్డ్ డిస్క్, ఇతర ఎలక్ట్రానిక్ వస్తువులు చోరీకి గురైనట్లు గుర్తించారు. పరిసర ప్రాంతాల్లో పోలీసులు తనిఖీలు నిర్వహించారు.

గూడూరు
సూళ్లూరుపేట/వెంకటగిరి

బైక్ ఢీకొని వృద్ధుడి మృతి

కోట, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని చిట్టేడు వద్ద శుక్రవారం మోటరు బైక్ ఢీకొనడంతో వెంకయ్య(85) మృతి చెందాడు. చిట్టేడు గ్రామానికి చెందిన వెంకయ్య ఉదయం రోడ్డుపై నడుచుకుంటూ వెళ్తుండగా అన్నంబాక గ్రామానికి చెందిన జగదీష్ మోటరు బైక్‌పై వెళ్తూ ఢీకొన్నాడు. తీవ్రంగా గాయపడ్డ వెంకయ్యను కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం గూడూరు ప్రభుత్వాస్పత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ పవన్‌కుమార్ తెలిపారు.

16న ఉచిత వైద్య శిబిరం

కోట, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని విద్యానగర్ సాయిబాబా మందిరం వద్ద ఈనెల 16వ తేదీన ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు నెల్లూరుకు చెందిన సుశీల నేత్రాలయ నిర్వాహకుడు డాక్టర్ సుధాకరరావు శుక్రవారం తెలిపారు. ఉదయం 10నుంచి 3 గంటల వరకు కంటి పరీక్షలు నిర్వహిస్తామన్నారు. వైద్య శిబిరానికి వచ్చేవారు ఆరోగ్యశ్రీ, ఈహెచ్‌ఎస్ కార్డు, ఆధార్ కార్డుతో తీసుకురావాలని సూచించారు. వివరాలకు 9704466171 నెంబర్‌ను సంప్రదించాలన్నారు.

నేటి నుంచి ఒంటిపూట బడులు

ఓజిలి, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఆదేశాల మేరకు శనివారం నుంచి అన్ని పాఠశాలల్లో మధ్యాహ్నం వరకే తరగతులు నిర్వహించనున్నట్లు ఎంఈవో శైలజ తెలిపారు. ఉదయం 7.45నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు తరగతులు ఉంటాయన్నారు. మండలంలోని 55 ప్రాథమిక, 3 ప్రాథమికోన్నత, 5 ఉన్నత, రెండు గురుకులాలతో పాటు ప్రైవేటు పాఠశాలలూ ఇదే సమయాన్ని పాటించాలన్నారు. అలాగే ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు మధ్యాహ్నం భోజనం పెట్టి ఇళ్లకు పంపేలా ఉపాధ్యాయులు చర్యలు తీసుకోవాలని ఎంఈవో పేర్కొన్నారు.

మహాలక్ష్మీదేవి గ్రామోత్సవం



ఉచ్చూరువారిపాళెంలో ఊరేగుతున్న అమ్మవారు

కోట, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని ఉచ్చూరువారిపాళెం గ్రామదేవత చతుర్భుజ మహాలక్ష్మీదేవి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం తెల్లవారుజామున అమ్మవారి గ్రామోత్సవం జరిగింది. ఐదు రోజులపాటు జరిగిన అమ్మవారి ఉత్సవాలు శనివారంతో ముగిశాయి. ఈ సందర్భంగా ధ్వజారోహణం, శాంతి హోమాలు జరిగాయి. అమ్మవారు ఊరేగుతున్న సమయంలో భక్తులు కొబ్బరికాయలు కొట్టి మొక్కులు తీర్చుకున్నారు.

ఎన్ఎంయూ ఆధ్వర్యంలో నిరసన

గూడూరు అర్బన్, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఆర్టీసీ డిపో వద్ద నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న నిరసన నాలుగో రోజు శనివారం కొనసాగింది. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ తమ న్యాయమైన సమస్యలను పరిష్కరించాలని నాలుగు రోజులుగా నిరసన తెలుపుతున్నా డిపో మేనేజర్ స్పందించడం లేదన్నారు. ఉన్నాతాధికారులు స్పందించి తమకు న్యాయం చేయాలని కోరారు.

ముత్యాలమ్మకు ప్రత్యేక పూజలు



చిల్లకూరు, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తూర్పు కనుపూరులో వెలసిన ముత్యాలమ్మకు శుక్రవారం పౌర్ణమి సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం అమ్మవారికి హోమ పూజలు చేశారు. రాత్రి అమ్మవారిని ప్రత్యేకంగా ఆలకరించి పల్లకీ సేవ జరిపారు. భక్తులు అమ్మవారి దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

ఎస్వీయూలో జర్మన్ భాష అభ్యసన కేంద్రం
స్టడీ వింగ్స్ ప్రతినిధులతో అధికారుల సమావేశం



సమావేశంలో ఇరు సంస్థల ప్రతినిధులు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), మార్చి 14 (విశ్వవిద్యాలయాలు): ఎస్వీయూలో జర్మన్ భాష అభ్యసన కేంద్రాన్ని ఏర్పాటు చేసేందుకు కసరత్తు చేస్తున్నారు. ఇందులో భాగంగా స్టడీ వింగ్స్ సంస్థ ప్రతినిధుల బృందం వర్సిటీ అధికారులతో శుక్రవారం సమావేశమైంది. ఇరు సంస్థల ప్రతినిధులు మాట్లాడుతూ జర్మనీలో విద్యా, ఉద్యోగావకాశాలు మెండుగా ఉన్నాయన్నారు. ఇవి పొందాలంటే జర్మన్ భాష నేర్చుకోవాలన్నారు. ఇందుకోసం యూనివర్సిటీలో జర్మన్ భాష అభ్యసన కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని భావిస్తున్నట్లు తెలిపారు. సమావేశంలో వీసీ అప్పారావు, రిజిస్ట్రార్ భూపతి నాయుడు, జర్మన్ స్టడీ వింగ్స్ ప్రతినిధులు నరేంద్రరెడ్డి, సుకన్య పాల్గొన్నారు.

అర్హతలేని సంస్థకు
సెల్ఫ్ డిఫెన్స్ ప్రోగ్రాం కేటాయింపా..?

తిరుపతి(విద్య), మార్చి 14 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో చదివే బాలికలకు స్వీయరక్షణ (సెల్ఫ్ డిఫెన్స్)పై శిక్షణ ఇచ్చే కాంట్రాక్టు అర్హతలేని సంస్థకు కేటాయించడం సరికాదని ఓబీసీ విద్యార్థి సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు డాక్టర్ యు.నాగేశ్వరరావు అన్నారు. ఎమ్మార్‌పల్లెలోని సంఘ కార్యాలయంలో ఆయన శుక్రవారం మీడియాతో మాట్లాడుతూ మ్యాన్ పవర్ ఏజెన్సీని నడిపే సంస్థకు స్వీయరక్షణ శిక్షణ కోసం వర్క్ ఆర్డర్ ఇవ్వడం దారుణమన్నారు. ఇదేసంస్థ నంద్యాల జిల్లాలో దరఖాస్తు చేసుకుంటే అర్హత లేదని ఇవ్వలేదని ఆరోపించారు. దీనిపై జిల్లా అధికారులు పునరాలోచించాలని కోరారు.

22ఏ భూములకు విముక్తి కల్పించండి

తిరుపతి, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): తిరుపతిలో చాలాచోట్ల నివాసిత ప్రాంతాలను నిషేధిత జాబితా (22ఏ)లో చేర్చారని, వాటికి విముక్తి కల్పించాలని జిల్లా ఇన్‌చార్జి, రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్‌ను కార్పొరేటర్లు కోరారు. డిప్యూటీ మేయర్ ఆర్సీ మునికృష్ణ నేతృత్వంలో విజయవాడలోని మంత్రి కార్యాలయంలో కార్పొరేటర్లు కలిశారు. గతంలో అనేకసార్లు లావాదేవీలు జరిగిన ఆస్తులు కూడా 22ఏలోకి వెళ్లిపోయాయని, నిషేధం ఎత్తివేసి క్రయ విక్రయాలకు అవకాశం కల్పించాలని కోరారు.





నాయుడుపేట సమీపంలో విన్నమాల వద్ద నిర్మించిన రింగ్ రోడ్డు - పెళ్లకూరు మండలం చిల్లకూరు వద్ద కాంతులు విరజిమ్ముతున్న ఎల్‌ఈడీ లైట్లు

రయ్... రయ్

- నాయుడుపేట - రేణిగుంట నడుమ సిక్స్ లేన్
- పూర్తయిన జాతీయ రహదారి పనులు
- గంటకు తగ్గిన ప్రయాణ సమయం

నాయుడుపేట, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): నాయుడుపేట - రేణిగుంట 71వ జాతీయ రహదారి పనులు పూర్తయ్యాయి. నాయుడుపేటలోని చెన్నై - కోల్‌కత్తా జాతీయ రహదారి నుంచి రేణిగుంట వరకు 57 కిలో మీటర్ల పొడవున్న ఈ మార్గాన్ని రూ.1931 కోట్ల వ్యయంతో సిక్స్ లేన్‌గా మార్చారు. నిర్మాణ పనులు దాదాపు పూర్తవడంతో అనధికారికంగా వాహనాలు రాకపోకలు సాగుతున్నాయి. ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన తిరుమల, తిరుపతి పుణ్యక్షేత్రాలతో పాటు శ్రీకాళహస్తి, కాణిపాకం, కాంచీపురం, తిరుత్తణి, తిరువళ్లూరు, శ్రీపురం, తిరువణ్ణామలై లాంటి ఆధ్యాత్మిక పుణ్యక్షేత్రాలకు వెళ్లే మార్గం రెండు లేన్‌లుగా ఉండేది. వాహనాల రద్దీ పెరగడంతో నిత్యం ప్రమాదాలు చోటు చేసుకునేవి. దీంతో నాయుడుపేట - తిరుపతి నడుమ ప్రయాణించాలంటే వాహనచోదకులు, ప్రజలు భయాందోళన చెందేవారు. ఈ నేపథ్యంలో సిక్స్ లేన్‌గా విస్తరించడానికి కేంద్ర ప్రభుతం 2020లో శ్రీకారం చుట్టింది. ఆ మేరకు రూ.1931 కోట్లు మంజూరు చేసింది. కాంట్రాక్టు దక్కించుకున్న మేఘా ఇంజినీరింగ్ సంస్థ 2022లో పనులు ప్రారంభించింది. నెల్లూరు, చెన్నై, శ్రీకాళహస్తి, తిరుపతి, బెంగళూరు ప్రాంతాల నుంచి రాకపోకలు సాగించే వాహనాలు నేరుగా వెళ్లేలా నాయుడుపేట మండలం విన్నమాల వద్ద చెన్నై - కోల్‌కత్తా జాతీయ రహదారిపై రింగ్ రోడ్డు నిర్మించారు. అలాగే నాయుడుపేట, పెళ్లకూరు మండలంలోని తాళ్వాయిపాడు, చావాలి, చిల్లకూరు, పెళ్లకూరు, టెంకాయతోపు, నెలబల్లి, తొట్టంబేడు మండలంలోని పొయ్య, శింగమాల, శ్రీకాళహస్తి బైపాస్, స్వర్ణముఖినది, ఊరందూరు, గున్నేరి, తొండమనాడు, కొత్తచెరువు, ఏర్పేడు, మల్లవరం తదితర గ్రామాల వద్ద వంతెనలు, అండర్ పాస్‌లతో పాటు శ్రీకాళహస్తి, ఏర్పేడు, రేణిగుంట వద్ద బైపాస్‌లు నిర్మించారు. రహదారికి ఇరువైపులా గ్రామాలున్న చోట అండర్ పాస్‌లు, సర్వీస్ రోడ్లు నిర్మించి దాదాపు 1500 ఎల్‌ఈడీ లైట్లు ఏర్పాటు చేశారు. ఏర్పేడు సమీపంలో టోల్‌ప్లాజా నిర్మించారు. అయితే నాయుడుపేట గోమతి సెంటర్, పెళ్లకూరు మండలంలోని తాళ్వాయిపాడు, చావాలి, గుర్రప్పతోట, చిల్లకూరు, టెంకాయతోపు, అక్కగారిపేట గ్రామల వద్ద సర్వీస్ రోడ్లు పూర్తి కాకపోవడంతో స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. దాదాపు పనులు పూర్తవడంతో ఇటీవల రాకపోకలను అనుమతించారు. దీంతో వాహనాలు రయ్ రయ్ మంటూ పరుగులు తీస్తూ సుమారు గంట సమయంలోనే తిరుపతికి చేరుకుంటున్నాయి. గతంలో రెండు గంటలకు పైగా ప్రయాణించాల్సి ఉండగా ప్రస్తుతం గంట సమయంలో వెళ్లిపోతుండడంతో వాహన చోదకులు, ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

చెంగాళమ్మ ఆలయంలో మహాచండీయాగం

సూళ్లూరుపేట, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేటలోని చెంగాళమ్మ ఆలయంలో శుక్రవారం పౌర్ణమి సందర్భంగా మహాచండీయాగం నిర్వహించారు. అదేవిధంగా టీడీపీ కార్యాలయం వద్దనున్న అభయ శంకరుడి ఆలయంలో అభిషేకం చేశారు. స్వామివారిని పుష్పాలతో అలంకరించి విశేష పూజలు చేశారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు ఆకుతోట రమేష్, చిట్టేటి పెరుమాల్ తదితరులు పాల్గొన్నారు.

పకడ్బందీగా పదో తరగతి పరీక్షలు

గూడూరు, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): పదో తరగతి పరీక్షలను పకడ్బందీగా నిర్వహించేలా చర్యలు చేపట్టినట్లు ఇన్‌చార్జి డీవైఈవో, ఎంఈవో-1 సనత్‌కుమార్ తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ ఈ నెల 17నుంచి 31వ తేదీ వరకు పదో తరగతి పరీక్షలు జరుగుతాయన్నారు. గూడూరు పట్టణంలో జడ్పీ బాలుర, బాలికల, జీఎస్ఆర్ మున్సిపల్, సీఎస్ మున్సిపల్, చెన్నూరు జడ్పీ ఉన్నత పాఠశాల, సెయింట్ మేరీస్, వివేకానంద, నారాయణ పాఠశాలల్లో పరీక్షలు జరుగుతాయన్నారు. ఉదయం 9:30నుంచి మధ్యాహ్నం 12:45 గంటల వరకు పరీక్షలు జరుగుతాయని, మొత్తం 1405 మంది విద్యార్థులు హాజరుకానున్నారని తెలిపారు. విద్యార్థులు అర గంట లోపే పరీక్షా కేంద్రాలకు చేరుకోవాలని సనత్‌కుమార్ సూచించారు.

అళఘునాథస్వామికి ప్రత్యేక పూజలు



మోహినీ అలంకారంలో అళఘునాథస్వామి

గూడూరు, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): స్థానిక అళఘునాథస్వామి ఆలయంలో వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం స్వామి వారిని మోహినీ అవతారంలో అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. లక్ష్మీ జయంతి సందర్భంగా భక్తులు సామూహిక కుంకుమార్చన పూజలు జరిపారు. అనంతరం స్వామివారి గ్రామోత్సవం నిర్వహించారు.

హరియాణా గవర్నర్‌ను కలిసిన కొమారి



దత్తాత్రేయకు శ్రీకృష్ణుడి ప్రతిమ అందజేస్తున్న కోటేశ్వరరావు

కోట, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): కోట పట్టణానికి చెందిన శ్రీభారత్ ట్రస్టు చైర్మన్ కొమారి కోటేశ్వరరావు శుక్రవారం హరియాణా గవర్నర్ బండారు దత్తాత్రేయను మర్యాదపూర్వకంగా కలిశారు. దత్తాత్రయ శ్రీకృష్ణుడి ప్రతిమను బహూకరించారు.

అన్నదానం

నాయుడుపేట, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): నాయుడుపేట పట్టణానికి చెందిన బీరదాల వెంకటమణి వర్ధంతి సందర్భంగా ఆయన కుమారుడు సురేష్, రమ దంపతులు శుక్రవారం స్థాని మేరీ వృద్ధాశ్రమంలో వృద్ధులకు అన్నదానం చేశారు. దాతలకు ఆశ్రమ నిర్వాహకులు సునీత, బెన్నీ కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో మునిదీప్, నందిత, సుమతి, శ్రీలక్ష్మి, వేణుగోపాల్, శ్రీనివాస్, ప్రదీప్ తదితరులు పాల్గొన్నారు.

మసీదుల వద్ద పోలీసు బందోబస్తు



జామియా మసీదు వద్ద పోలీసు బందోబస్తు

సూళ్లూరుపేట, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): హోలీ పండగ నేపథ్యంలో ముస్లింలకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా సీఐ మురళీకృష్ణ, ఎస్‌ఐ బ్రహ్మానాయుడు ఆధ్వర్యంలో సూళ్లూరుపేటలోని అన్ని మసీదుల వద్ద పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. హోలీ సంబరాల నేపథ్యంలో ముస్లింలకు పవిత్రమైన రంజాన్ మాసంలో ఎటువంటి అవాంఛనీయ ఘటనలు తలెత్తకుండా అక్బరియా మసీదు, జామియా తదితర మసీదుల వద్ద పోలీసు బందోబస్తు ఏర్పాటు చేసినట్లు సీఐ తెలిపారు.

సూర్యప్రభ వాహనంపై వేణుగోపాలుడు



సూర్యప్రభ వాహనంపై ఊరేగుతున్న వేణుగోపాలుడు

సూళ్లూరుపేట, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): మంగళంపాడులోని సౌందర్య వల్లీ రుక్మిణీ సత్యభామ గోదా సమేత వేణుగోపాలస్వామి ఆలయంలో బ్రహ్మోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. శుక్రవారం వేణుగోపాలుడు సూర్యప్రభ వాహనంపై గ్రామవీధుల్లో ఊరేగారు. ఆలయ ప్రధాన అర్చకులు శెల్వంస్వామి ఆధ్వర్యంలో ఉదయం ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. రాత్రి చంద్రప్రభ వాహనంపై స్వామివారిని కొలువుదీర్చారు. ఉభయకర్తలుగాఎలింబేటి వీరాస్వామి మొదలి, ఎస్.మునస్వామి మొదలి వ్యవహరించారు

ఉత్సాహంగా హోలీ సంబరాలు



సూళ్లూరుపేటలో రంగులు చల్లుకుంటున్న యువకులు

సూళ్లూరుపేట, మార్చి 14(ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేటలో హోలీ పండుగ సంబరాలు అంబరాన్నంటాయి. శుక్రవారం ఉదయం నుంచే చిన్న, పెద్ద, ఆడ, మగ అందరూ ఒకరినొకరు రంగులు చల్లుకుంటూ సందడి చేశారు. చెడుపై మంచి సాధించిన విజయానికి గుర్తు హోలి పండుగను విభేదాలను మరిచి అందరూ ఆనందకేళీగా జరుపుకున్నారు.

ఓజిలి: మండలంలోని కురుగొండ, మానమాల, ఓజిలి, అరిమేనిపాడు, అత్తివరం, రాచపాళెం తదితర గ్రామాల్లో హోలీ వేడుకలు జరిగాయి. యువకులు రంగులు చల్లుకుని కేరింతలు కొట్టారు.

నాయుడుపేట టౌన్: పట్టణంలోని దర్గావీధిలో హోలీ వేడుకలు నిర్వహించారు. యువత, స్థానికులు రంగులు చల్లుకుంటూ కేరింతలు కొట్టారు.

తడ: హోలీ పండుగ పర్వదినాన్ని తడలో వేడుకగా జరుపుకున్నారు. ఉదయం నుంచే పిల్లలు, యువకులు రంగులు చల్లుకొంటూ గంతులేశారు. కేక్ కట్ చేసి మిఠాయిలు పంచిపెట్టారు.

కోట: మండల పరిధిలోని విద్యానగర్, కోట ప్రాంతాల్లో మార్వాడీలు హోలీ సంబరాలు జరుపుకున్నారు. ఒకరిపై ఒకరు రంగులు చల్లుకుంటూ కేరింతలు కొడుతూ చిందులేశారు.

ఘనంగా జనసేన ఆవిర్భావ దినోత్సవం



రక్తదాన శిబిరం వద్ద జనసేన నాయకులు

సూళ్లూరుపేట, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేటలో జనసేన ఆవిర్భావ దినోత్సవాన్ని శుక్రవారం ఆపార్టీ నాయకులు ఘనంగా జరుపుకున్నారు. ఆర్టీసీ బస్టాండు వద్ద జనసేన నాయకులు ఆవుల రమణ, మాబాషా ఆధ్వర్యంలో పార్టీ జెండా ఎగరవేశారు. అన్నదానం చేశారు. ఆర్అండ్‌బీ బంగ్లా వద్ద రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. హేమంత్ శర్మ, ఆవుల దాస్, నక్క హరిబాబు, శంఖు సురేష్, వల్లూరు రాజా, రేవంత్, సూరి, రామగిరి, పద్మజ, బీజేపీ నాయకురాలు బి.విజయమ్మ తదితరులు పాల్గొన్నారు.

మద్యం మత్తులో పామును పట్టే యత్నం
యువకుడిని కాటు వేసిన రక్తపింజరి

రేణిగుంట, మార్చి 14, (ఆంధ్రజ్యోతి): మద్యం మత్తులో పామును పట్టుకునే ప్రయత్నంలో ఓ యువకుడిని విషపాము కాటు వేసింది. ఈ ఘటన శుక్రవారం రాత్రి జరిగింది. పాత చెక్‌పోస్టు వద్ద ద్విచక్ర వాహనాల మెకానిక్ షాపులో పాము దూరింది. దీంతో సమీపంలోని సిమెంట్ బ్రిక్స్ కంపెనీ ఎక్స్‌కవేటర్ డ్రైవర్‌గా పని చేస్తున్న పాములు పట్టే యువకుడిని మెకానిక్ షాపు సిబ్బంది పిలిచారు. అప్పటికే పూటుగా తాగి ఉన్న ఆ యువకుడు నేరుగా వెళ్లి పాము తలని పట్టుకున్నాడు. ఈ క్రమంలో పాము కుడిచేతికి పాము చుట్టుకుని కాటు వేసింది. దీంతో స్థానికులు హుటాహుటిన యువకుడిని చికిత్స నిమిత్తం ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. పామును కొట్టి చంపేశారు.

కంటైనర్ లారీని ఢీకొన్న కారు: డ్రైవర్‌కు తీవ్రగాయాలు

రేణిగుంట, మార్చి 14, (ఆంధ్రజ్యోతి) : కంటైనర్ లారీని కారు ఢీకొనడంతో డ్రైవర్ తీవ్రంగా గాయపడ్డాడు. శుక్రవారం రాత్రి రేణిగుంట - కడప మార్గం మధ్యంలోని కుక్కలు దొడ్డి వద్ద ఈ ప్రమాదం జరిగింది. స్థానికుల కథనం మేరకు రోడ్డు పక్కన ఆగి ఉన్న మినీ లారీని కంటైనర్ లారీ ఢీ కొట్టి ఆగిపోవడంతో వెనుక వస్తున్న కారు అదుపుతప్పి కంటైనర్ లారీని వెనుక వైపు ఢీ కొట్టింది. దీంతో కారు లోఉన్న ఎయిర్ బ్యాగ్స్ ఓపెన్ చేసుకోవడంతో ప్రాణాపాయం తప్పింది. అయితే గాయపడ్డ కారు డ్రైవర్‌ను రేణిగుంట అర్బన్ పోలీసులు రుయా ఆస్పత్రికి తరలించారు. ఈమేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ముక్కంటి సేవలో వీహెచ్‌పీ ప్రముఖ్


అలయం వద్ద సాయిరెడ్డి తదితరులు

శ్రీకాళహస్తి, మార్చి 14(ఆంధ్రజ్యోతి): జ్ఞాన ప్రసూనాంబ సమేత శ్రీ కాళహస్తీశ్వరుడిని శుక్రవారం వీహెచ్‌పీ ఆంధ్ర ప్రదేశ్ దక్షిణప్రాంత అధ్యక్షుడు ఎన్.సాయిరెడ్డి దర్శించుకున్నారు. ఆలయ అధికారులు ఆయనకు స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. దర్శనానంతరం వేదపండితులు ఆయన్ను ఆశీర్వదించి స్వామిఅమ్మవార్ల జ్ఞాపిక, తీర్థప్రసాదాలు అందజేశారు. అనంతరం వీహెచ్‌పీ, భజరంగ్‌దళ్ కార్యకర్తలతో సమావేశమై సనాతన ధర్మం, ఆలయాలపై జరుగుతున్న దాడులను ఎలా ఎదుర్కోవాలో మార్గనిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో వీహెచ్‌పీ శ్రీకాళహస్తి కార్యదర్శి శశాంక్, హిందూ సంఘాల కార్యకర్తలు శాండిల్య, సతీష్, లోకేష్, హేమంత్, కిరణ్, శ్యాం తదితరులు పాల్గొన్నారు.

శాస్త్రోక్తంగా ద్రౌపది దేవి ఆలయ మహాకుంభాభిషేకం



భారీగా తరలివచ్చిన భక్తులు - ధర్మరాజుల ఆలయ శిఖర సంప్రోక్షణం

నాగలాపురం, మార్చి 14, (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ద్రౌపది దేవి సమేత ధర్మరాజుల స్వామి ఆలయ కుంభాభిషేక మహోత్సవాలు వైభవంగా నిర్వహించారు. ఈ ఆలయ జీర్ణోద్ధరణ పనులు పూర్తవడంతో శుక్రవారం ఉదయం గోపూజతో కార్యక్రమాలు ప్రారంభించారు. అనంతరం సుమంగళి పూజ, గోపుర శిఖర సంప్రోక్షణ, విగ్రహ ప్రాణ ప్రతిష్ఠ కార్యక్రమాలు శాస్త్రోక్తకంగా నిర్వహించారు. తదనంతరం అష్ట బంధన కుంభాభిషేకం సందర్భంగా ఆలయ గోపురం నుంచి అర్చకులు కలశ అభిషేక జలాన్ని భక్తులపై చల్లారు.

ప్రభుత్వ భూమిలో హెచ్చరిక బోర్డు



రేణిగుంట, మార్చి 14, (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ భూమిలో రెవెన్యూ అధికారులు హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేశారు. శుక్రవారం తహసీల్దార్ సురేష్‌బాబు ఆదేశాల మేరకు ఆర్ఐ జయకృష్ణ, వీఆర్వో శంకర్ పాత విమానాశ్రయం రోడ్డులోని హైవే పక్కన కొత్తపాలెం రెవెన్యూ సర్వే నెం. 96/3లో హెచ్చరిక బోర్డును ఏర్పాటు చేశారు. సదరు భూమిలో ఎవరైనా ప్రవేశిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

సీఎం, మంత్రికి రుణపడి ఉంటా: ఎమ్మెల్యే

పిచ్చాటూరు, మార్చి 14(ఆంధ్రజ్యోతి): క్లిష్ట పరిస్థితుల్లో తనకు అండగా ఉండడంతో పాటూ ఎమ్మెల్యే టిక్కెట్ కేటాయించి గెలిపించిన సీఎం చంద్రబాబుకు, మంత్రి లోకేశ్‌కు రుణపడి ఉంటానని ఎమ్మెల్యే ఆదిమూలం తెలిపారు. శుక్రవారం స్థానిక టీడీపీ పార్టీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ... 2024 మార్చి 14 మధ్యాహ్నం 12 గంటలకు ప్రెస్ మీట్ పెట్టి నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థిగా తన పేరును చంద్రబాబు ప్రకటించిన విషయాన్ని గుర్తు చేశారు. తన గెలుపు కోసం నియోజకవర్గంలో పర్యటించడంతో పాటు జిల్లా, మండల, గ్రామ స్థాయిలో తెలుగుదేశం, జనసేన, బీజేపీలకు చెందిన నాయకులను, కార్యకర్తలను అవిశ్రాంతంగా కృషి చేయించారన్నారు. తన గెలుపునకు కృషి చేసిన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు తెలుపుతున్నా నన్నారు. భవిష్యత్తులో సీఎం, మంత్రి లోకేశ్ ఆదేశానుసారం ప్రతి ప్రభుత్వ పార్టీ కార్యక్ర మాన్ని దిగ్విజయంగా నిర్వహి స్తానన్నారు. అందుకు నియోజకవర్గంలోని కూటమి పార్టీ నాయకులు, కార్యకర్తలు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

● జనసేన నాయకులకు శుభాకాంక్షలు

నేడు పిఠాపురంలో జనసేన ఆవిర్భావ దినోత్సవాలు జరుపుకుంటున్న జన సైనికులకు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్‌కు మనస్ఫూర్తిగా శుభాకాంక్షలు తెలుపుతున్నానని ఎమ్మెల్యే ఆదిమూలం చెప్పారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

నాగలాపురం, మార్చి 14, (ఆంధ్రజోతి): మండలంలోని సుబ్బానాయుడు కండ్రిగ, బీరకుప్పం సబ్‌స్టేషన్ల పరిధిలో ఈనెల 15న శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ట్రాన్స్‌కో ఏడీ రమేష్‌చంద్ర, ఏఈ పృథ్వీ పేర్కొన్నారు. మధ్యాహ్నం 2నుంచి సాయంత్రం 5గంటల వరకు మెయింటెన్స్ మరమ్మతుల కారణంగా సరఫరా నిలిపివేయనున్నట్లు తెలిపారు.

లో వోల్టేజీ సమస్య పరిష్కారం


పాంచాలినగర్‌లో ఏర్పాటు చేసిన కొత్త ట్రాన్స్‌ఫార్మర్

రేణిగుంట, మార్చి 14, (ఆంధ్రజ్యోతి): లో వోల్టేజీ సమస్యలకు, వేసవిలో విద్యుత్ సరఫరాకు ఆటంకం తలెత్తకుండా ప్రత్యేక చర్యలను విద్యుత్ శాఖ చేపట్టింది. ఎమ్మెల్యే చేపట్టిన ప్రజా దర్బార్ కార్యక్రమంలో మండలంలోని ప్రజలు అధిక సంఖ్యలో లో వోల్టేజీ సమస్యను పరిష్కరించాలని వినతి పత్రాలు ఇచ్చారు. ఈ మేరకు డీఈఈ రమేష్ బాబు మండలంలో లో వోల్టేజీ సమస్య ఉన్న ప్రాంతాలను గుర్తించి కొత్తగా లైన్లు లాగారు. తారకరామా నగర్, కరకంబాడి బీసీ కాలనీ, వసుందర నగర్, పత్నికులం, అన్నైనగర్, రామకృష్ణాపురం బీసీ కాలనీ, వడ్డిమిట్ట, పాంచాలీ నగర్‌లో పాత ట్రాన్స్‌ఫార్మర్లను తొలగించి అధిక సామర్థ్యం ఉన్న కొత్త వాటిని ఏర్పాటు చేశారు. అర్బన్ ఏఈ పుణ్యకోటి, విద్యుత్ లైన్ మెన్ తదితరులు పాల్గొన్నారు.

భక్తులకు అన్నదానం

శ్రీకాళహస్తి, మార్చి 14(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయ సమీపంలోని తేరువీధి బస్‌షెల్టర్ సమీపంలో శుక్రవారం జడ్పీ బాలుర ఉన్నత పాఠశాల 1993-94 బ్యాచ్ విద్యార్థుల ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం చేశారు. వారు మాట్లాడుతూ పౌర్ణమి కావడంతో తాము భక్తులకు అన్నదానం చేయడం చాలా సంతోషంగా ఉందన్నారు. మూడు సంవత్సరాలుగా ప్రతి పౌర్ణమికి అన్నదానం చేస్తున్నట్లు తెలిపారు

వైద్య శిబిరానికి విశేష స్పందన



శ్రీకాళహస్తి, మార్చి 14(ఆంధ్రజ్యోతి): తొట్టంబేడు మండలం తాటిపర్తి పంచాయతీ కల్లిపూడిలో కొలువై ఉన్న చెంచుమహాలక్ష్మి ఆలయ పవిత్రోత్సవాలను పురస్కరించుకుని రూప మల్టీస్పెషాలిటీ అధినేత డాక్టర్ కోగిల సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో శుక్రవారం వైద్యశిబిరం నిర్వహించారు. అవసరమైన వారికి మందులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వైసీపీ ఉమ్మడి జిల్లా ప్రధాన కార్యదర్శి ఉన్నం వాసుదేవ నాయుడు, ఎంపీపీ ఉన్నం నిర్మల, సర్పంచ్ కోగిల నాగేంద్ర, ఆలయ కమిటీ సభ్యులు పెరుమాల్‌రెడ్డి, గోపిరెడ్డి, వైద్యులు లావణ్యకుమార్‌రెడ్డి, నారాయణ, రాధ, కృష్ణకుమార్ తదితరులు పాల్గొన్నారు.

రజనీ కుటుంబాన్ని ఆదుకోండి


రజనీ మృతదేహానికి నివాళులర్పిస్తున్న దళిత, యానాది సంఘ నాయకులు

శ్రీకాళహస్తి, మార్చి 14(ఆంధ్రజ్యోతి): బీఎన్‌కండ్రిగ మండలం వరత్తూరు వద్ద రోడ్డు ప్రమాదానికి గురైన కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని దళిత, యానాది సంఘం నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం మృతి చెందిన రజనీ మృతదేహాన్ని శ్రీకాళహస్తి ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో పరిశీలించారు. అనంతరం వారు మాట్లాడుతూ ఒకే కుటుంబంలో ఒకరు మరణించడం మరో ఇద్దరు తీవ్రంగా గాయపడడం బాధాకరమన్నారు. రోడ్డు ప్రమాదాల కట్టడికి చర్యలు తీసుకోవడం లేదన్నారు. కనీసం 108 వాహనాలు సకాలంలో సంఘటనా స్థలాలకు చేరుకోకపోవడంతో క్షతగాత్రులు మరణిస్తున్నారన్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం రజని కుటుంబాన్ని ఆదుకోవాలని కోరారు. ఈ కార్యక్రమలో దళిత సంఘాల నాయకులు జనమాల గురవయ్య, గోపి, ప్రజానాట్య మండలి అధ్యక్షురాలు చారుశీల, యానాది సంఘం రాష్ట్ర అధ్యక్షులు కోటయ్య, బత్తెయ్య తదితరులు పాల్గొన్నారు.

నేడు మండల సర్వసభ్య సమావేశం

సత్యవేడు, మార్చి 14 (ఆంధ్రజ్యోతి) సత్యవేడు మండల మీట్ ఈనెల 15న శనివారం ఎంపీడీవో కార్యాలయ సమావేశం మందిరంలో ఎంపీపీ ప్రతిమ అధ్యక్షతన జరుగుతుందని ఎంపీడీవో చంద్రశేఖర్ పేర్కొన్నారు. అధికారులు తమ శాఖ ప్రగతి నివేదికలతో హాజరు కావాలని, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచులు తప్పనిసరిగా పాల్గొనాలని కోరారు.

పేడ దిబ్బల నడుమ తాగునీటి మోటరు

కలుషితమవుతున్న నీరు ● మరమ్మతులకు నోచుకోని చేతి బోర్లు ● పట్టించుకోని అధికారులు



బోరు మోటరు పక్కనే వేసిన పేడ దిబ్బలు - మరమ్మతులకు గురైన చేతి బోరు

బుచ్చినాయుడుకండ్రిగ, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని భవానీ శంకరాపురంలో తాగునీటి మోటరు సమీపంలో పేడ దిబ్బల కారణంగా నీరు కలుషితమవుతున్నట్లు గ్రామస్తులు తెలిపారు. తాగునీటి కోసం శివార్లలో బోరు వేసి సరఫరా చేస్తున్నారు. అయితే మోటరు సమీపంలో పలువురు పేడ వేస్తుండడంతో బోరులోని నీరు కలుషిత మవుతున్నట్లు చెప్పారు. దీనిపై కార్యదర్శికి, సర్పంచు దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోలేదన్నారు. గ్రామంలో మూడు తాగునీటి చేతి బోర్లు మరమ్మతులకు గురై సంవత్సరం కావస్తోందన్నారు. ప్రస్తుతం డైరెక్ట్ పంపింగ్ ద్వారా నీరు సరఫరా అవుతోందని కరెంట్ పోతే ఇబ్బంది పడుతు న్నామన్నారు. అధికారులు స్పందించాలని కోరుతున్నారు.

ఘనంగా హోలీ


బీఎన్‌కండ్రిగ, సత్యవేడు పట్టణాల్లో జరిగిన సంబరాలు


నాగలాపురంలో...



బుచ్చినాయుడుకండ్రిగ, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కనమనంబేడులోని ఏకలవ్య గురుకుల పాఠశాల, బీఎన్‌కండ్రిగల్లో హోలీ వేడుకలను శుక్రవారం ఘనంగా జరుపుకున్నారు. సుఖం, దుఃఖం, సంతోషం, విచారం అన్ని కలిసిన రంగులే ఈ హోలీ అని ప్రిన్సిపాల్ ధర్మేంద్రసింగ్ తెలిపారు. వయోభేదం లేకుండా అందరూ రంగులు చల్లుకుని శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ప్రతి ఒక్కరి జీవితం ఆనందమయం కావాలని ఆకాంక్షంచారు.

నాగలాపురం (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని బజారు వీధిలో ఉన్న మంగల్ జ్యూలరీ వద్ద శుక్రవారం హోలీ పండుగను ఘనంగా నిర్వహించారు. స్నేహితులు, బంధువులు ఒకరికొకరు రంగులు చల్లుకుంటూ హోలీ శుభాకాంక్షలు తెలుపుకున్నారు.

సత్యవేడు (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పలు ప్రాంతాల్లో రంగులను చల్లుకుంటూ యువకులు కేరింతలతో సందడి చేశారు. ఉత్తరాదికి చెందిన వారు గురువారం రాత్రి హోలీకా దహన్ నిర్వహించి చెడుపై మంచి విజయం సాధించాలని ప్రార్థనలు నిర్వహించారు. మరోవైపు శ్రీసిటీ పరిసర ప్రాంతాల్లో ఉన్న ఉత్తరాదికి చెందిన వలస కార్మికులు హోలీ సంబరాలతో తడిసి ముద్దయ్యారు.

రేణిగుంట (ఆంధ్రజ్యోతి): హోలీ పర్వదినాన్ని మార్వాడీలు రంగులు చల్లుకొని ఘనంగా నిర్వహించుకున్నారు. పట్టణం సహా, రేణిగుంట గాజులమండ్యం పారిశ్రామిక వాడల్లో వివిధ పరిశ్రమల్లో కార్మికులుగా ఉన్న ఉత్తరాదివాసులు రంగులు చల్లుకొని సంబరాలను ఘనంగా నిర్వహించుకున్నారు.

ఆదర్శ పాఠశాలలో ఇంటర్ ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

కేవీబీపురం, మార్చి 14(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాలలో 2025-26 విద్యాసంవత్సరానికి సంబంధించి మొదటి సంవత్సరం ఇంటర్మీడియట్‌కు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ మోహన్‌రెడ్డి చెప్పారు. ఎంపీసీ, బైపీసీ, ఎంఈసీ, సీఈసీ గ్రూపులకు సంబంధించి అర్హులైన విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలన్నారు. జిల్లాలో ప్రభు త్వ పాఠశాలల్లో 10వ తరగతి చదివిన వారు అర్హులన్నారు. ఈనెల 18నుంచి మే 22వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఓసీ, బీసీలకు రూ.150, ఎస్సీ, ఎస్టీలకు రూ.100 రుసుం చెల్లించి దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు.

ఘనంగా సరస్వతి పూజ


పూజల అనంతరం విద్యార్థులు, ఉపాధ్యాయులు

బుచ్చినాయుడుకండ్రిగ, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కల్లివెట్టు ఉన్నత పాఠశాలలో టెన్త్ విద్యార్థులు సరస్వతి పూజను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు సంప్రదాయ దుస్తులను ధరించి ఓంకార ప్రతిమ ముందు జ్యోతిని వెలిగించి పూజలు చేశారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం రూపేష్‌కుమార్ మాట్లాడుతూ ఈనెల 17నుంచి జరగనున్న టెన్త్ పబ్లిక్ పరీక్షలకు సంబంధించి ప్రణాళికాబద్ధంగా చదివితే మంచి మార్కులు సాధించవచ్చన్నారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ముస్లింల సంక్షేమం... బొజ్జల లక్ష్యం

● శ్రీకాళహస్తి ఐ-టీడీపీ అధ్యక్షుడు షేక్ ఖాదర్

శ్రీకాళహస్తి, మార్చి 14(ఆంధ్రజ్యోతి): ముస్లింల సంక్షేమం, అభివద్ధే లక్ష్యంగా ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ పనిచేస్తున్నారని ఐ-టీడీపీ శ్రీకాళహస్తి అధ్యక్షుడు షేక్ ఖాదర్ తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ అసెంబ్లీలో ఈద్గాలు, దర్గాలు, షాదీ మహళ్ల, శ్మశానాల అభివృద్ధి కోసం ప్రస్తావించడం ఇందుకు నిదర్శనమన్నారు.ఐదేళ్ల వైసీపీ పాలనలో ముస్లింలను కొన్ని అంశాల్లో కించపరిచేలా చేసిందన్నారు.

అంగన్‌వాడీ కార్యకర్తకు సీఐటీయూ పరామర్శ

పిచ్చాటూరు, మార్చి 14(ఆంధ్రజ్యోతి): ఇటీవల విజయవాడలో జరిగిన అంగన్‌వాడీ కార్యకర్తల ఆందోళన కార్యక్రమానికి వెళ్లిన పిచ్చాటూరు అంగన్‌వాడీ కార్యకర్త శ్రీవాణి బ్రెయిన్ స్ట్రోక్‌కు గురైన విషయం విదితమే. విజయవాడ ఆస్పత్రి నుంచి ఆమెను తిరుపతి రుయాకు గురువారం తీసుకొచ్చారు. శ్రీవాణికి అందిస్తున్న చికిత్సలపై సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు బాలసుబ్రహ్మణ్యం, అంగన్‌వాడీ యూనియన్ గౌరవాధ్యక్షుడు ప్రసాదరావు ఆరా తీశారు. రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు దాసరి జనార్దన్, జిల్లా కమిటీ సభ్యులు నాగరాజు, అంగన్‌వాడీ యూనియన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు పద్మలీల, రాజేశ్వరి, పిచ్చాటూరు ప్రాజెక్టు అధ్యక్షురాలు ఇంద్రాణి, అంగన్‌వాడీ కార్యకర్తలు కృష్ణవేణి, కల్యాణి, ప్రమీల, అముద తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్యంపై ఇంటింటా అవగాహన

పిచ్చాటూరు, మార్చి 14(ఆంధ్రజ్యోతి): మండలంలో పారిశుధ్యంపై ప్రజా చైతన్య కార్యక్రమం నిర్వహించాలని పంచాయతీ కార్యదర్శులకు, అధికారులకు, సిబ్బందికి ఎంపీడీవో మహ్మద్‌రఫి దిశానిర్దేశం చేశారు. ప్రతి రోజు చెత్త సేకరణ చేసి ప్లాస్టిక్ బ్యాగులు వాడకుండా అవగాహన కల్పించాలన్నారు. వ్యక్తిగత శుభ్రతతో పాటు పరిసరాలు శుభ్రంగా ఉంటే మంచి జీవన ప్రమాణాలతో జీవించవచ్చన్నారు. ఈనెల 15న అన్ని గ్రామాల్లో స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి ప్రజాప్రతినిధులు, నాయకులు హాజరుకావాలని ఆయన కోరారు.

భోజనంలో బొద్దింక

శ్రీకాళహస్తి, మార్చి 14(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఓ హోటల్ భోజనంలో బొద్దింక రావడంపై విమర్శలు వెల్లువెత్తాయి. రామసేతు వంతెన బస్టాప్ ఎదురుగా ఉన్న ఓ హోటల్‌లో శుక్రవారం భోజనంలో బొద్దింక రావడంతో భక్తులు ఆవేదన చెందారు. హోటల్ యజమాని దృష్టికి తీసుకెళ్లడంతో మరో ప్లేటు భోజనం ఇచ్చారు. భోజనంలో బొద్దింక ఫొటో సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారింది.

రోడ్డు ప్రమాదంలో పెయింటర్లకు గాయాలు


క్షతగాత్రులను తరలించడానికి వచ్చిన పోలీసులు

శ్రీకాళహస్తి, మార్చి 14(ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో ఇద్దరు గాయపడ్డారు. తొట్టంబేడు మండలం కన్నలి ఎస్టీకాలనీ వద్ద పీఎన్ జాతీయ రహదారిపై జరిగింది. నెల్లూరు జిల్లా కందుకూరుకు చెందిన మధుసూదనరావు, శివనాగరాజు పెయింటర్లు. ద్విచక్ర వాహనంపై రెండురోజుల క్రితం తమిళనాడులోని అరుణాచలంకు వెళ్లారు. శుక్రవారం తిరుగు ప్రయాణమయ్యారు. మార్గమధ్యంలో కన్నలి ఎస్టీకాలనీ వద్ద ద్విచక్ర వాహనం అదుపు తప్పి బోల్తా పడ్డారు. ఈ ఘటనలో మధుసూదన్‌రావు తీవ్రంగా, శివనాగరాజు స్వల్పంగా గాయపడ్డారు. శ్రీకాళహస్తి 2వ పట్టణ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని క్షతగాత్రులను శ్రీకాళహస్తి ప్రభుత్వ ఏరియా ఆస్పత్రికి తరలించారు.